జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



రామరాజ్యం తేవాలన్నదే

# నా ఆకాంక్ష

## టెంపుల్ టూరిజంగా ఒంటిమిట్టను అభివృద్ధి చేస్తాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు
- కన్నుల పండువగా కళ్యాణోత్సవం... తరలివచ్చిన భక్తజనం



**ఒంటిమిట్ట:** ఒంటిమిట్టను టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడికి వచ్చే భక్తులు రెండు మూడు రోజులు ఉండేలా సదుపాయాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కడప జిల్లా, మిగతా.. 8లో

ఖాకీకానూన్

# గోరంట్లకు ప్రేమతో..

## - ఇట్లు గుంటూరు పోలీసులు!



- మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ అనంతపురం టు గుంటూరు జైత్రయాత్ర
- టీడీపీ కార్యకర్త కిరణ్‌పై పోలీసుల సమక్షంలోనే దాడికి యత్నం
- కిరణ్ ఆనుపానులు మాధవ్‌కు చెప్పిందెవరు?
- పోలీసులలో వైసీపీ వేగులున్నారా?
- ఆరుగురు నిందితులలో నలుగురికి ముసుగేసిన పోలీసులు
- మాధవ్‌ను మాత్రం మినహాయించిన గుంటూరు పోలీసులు
- కిరణ్‌కు మాత్రం ముసుగేసిన పోలీసులు
- అసలు నిందితులకు ముసుగువేయమని ఆదేశించింది ఎవరు?
- కారులోనే ఉండి ఖాకీలపై మాధవ్ కన్నెర్ర
- కిరణ్‌పై 111 సెక్షన్ ఎలా నమోదుచేస్తారన్న జడ్జి
- మంగళగిరి సీఐ ఓవరాక్షన్‌పై జడ్జి ఆగ్రహం, సీఐ మెమోకు ఉత్తర్వు
- మాధవ్‌ను ఆడుమగాడ్రా బుజ్జీ అంటూ తమ్ముళ్ల కితాబు



(మార్తి సుబ్రహ్మణ్యం)

అద్భుతాలు సృష్టించేవాడిని.. సాహసికుడిని.. దమ్మున్న వాడిని చూసి.. 'ఆడు మగాడ్రా బుజ్జీ' అని, ముద్దుగా నోరారా కీర్తిస్తుంటాం. మహేష్ హీరోగా వచ్చిన 'అతడు' సినిమాలో, తనికెళ్ల భరణి పాపులర్ డైలాగిది. ఇప్పుడు.. అనంతపురం జిల్లా నుంచి గుంటూరుకు కాన్వాయ్‌తో జైత్రయాత్రగా వచ్చి, టీడీపీ కార్యకర్తను పోలీసుల ఎదుటే కొట్టబోయి, పోలీసులను గడగడలాడించి, వారితోనే సెల్‌ఫోను సేవలు చేయించుకుని, సహ నిందితులతోపాటు ముసుగువేయించుకోకుండా, విజయగర్వంతో రెచ్చిపోయిన వైసీపీ మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను స్వయంగా తమ్ముళ్లు.. 'ఆడు మగాడ్రా బుజ్జీ' అని నోరారా కితాబు ఇస్తున్న వైచిత్రి ఇది.

గోరంట్ల మాధవ్ గుర్తున్నారా?

అదేనండి.. సెల్‌ఫోన్‌లో ఒక మహిళకు తన ఫ్యాంటు జిప్పు తీసి చూపించిన మదనగోపాలుడు. పోక్సోతోపాటు బోలెడు కేసులున్న ఘనుడాయన. ఇప్పుడాయన తన అనంతపురం జిల్లా నుంచి గుంటూరుకు, అనుచరులతో వచ్చి.. పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై, పోలీసు సమక్షంలోనే దాడికి తెగబడిన గోరంట్ల దాదాగిరి హాట్‌టాపిక్‌గా మారింది. వైసీపీ అధికారం కోల్పోయి తొమ్మిదినెలలయినా.. టీడీపీ గద్దెనెక్కి 9 నె లలవు తున్నప్పటికీ.. ఇంత గుండెధైర్యంతో పోలీసులపై దాదాగిరి చేయడమే అందరి ఆశ్చర్యానికి అసలు కారణం. ఇది వైసీపీలో పెరిగిన మనోధైర్యమా? టీడీపీలో తగ్గుతున్న ఆత్మవిశ్వాసమా? గోరంట్ల తెగింపు కూటమి కార్యకర్తలకు ఇస్తున్న సంకేతం ఏమిటి? అసలు పోలీసులు ఇస్తున్న సందేశం మిగతా.. 2లో

### రాజమండ్రి జైలుకు మాధవ్

- పోలీసు విధులను అడ్డుకున్నందుకు కేసు

మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్‌ను పోలీసులు గుంటూరు మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు మాధవ్‌కు ఈ నెల 24 వరకు రిమాండ్ విధించింది. 14 రోజుల రిమాండ్ నేపథ్యంలో ఆయనను పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. అయితే అక్కడ తమకు తగిన సౌకర్యాలు లేవని నెల్లూరు జైలు అధికారులు చెప్పడంతో.. మాధవ్, ఆయన అనుచరులను రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు రాత్రి తరలించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై మాధవ్‌తో పాటు, మరో ఐదుగురు నిందితులకు కూడా కోర్టు రిమాండ్ విధించింది.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం, పోలీసులు మాధవ్‌ను ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. రిమాండ్‌ను తిరస్కరించాలని మాధవ్ తరపున వాదించిన న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోరారు. కోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.

వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని.. ఎస్పీ కార్యాలయానికి తరలిస్తుండగా, మాధవ్ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. చుట్టుగుంట జంక్షన్ వద్ద తన కారును అడ్డుగా ఉంచి, కిరణ్ కుమార్‌పై దాడికి యత్నించారు. ఈ ఘటనలో ఆయన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు తెలిపారు.

## సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించం



- తప్పు చేసిన వాళ్ల విషయంలో చంఢశాసనుడిగా ఉంటా
- కూటమి ప్రభుత్వానిది సుపరిపాలన
- ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామనే నమ్ముతున్నా
- పూలే స్ఫూర్తితో సంక్షేమ పాలన సాగిస్తున్నాం
- సంక్షేమంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత
- చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- నూజివీడు నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆగిరిపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఘనంగా పూలే జయంతి వేడుకలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం

2లో..

## తిరుమల క్షేత్రంలో మహా పాతకం

- టీటీడీ గోశాల కాస్తా గోవధశాలగా మారింది
- మూడు నెలల్లో వందకు పైగా గోవులు మృత్యువాత
- విషయం బయటకు రానివ్వకుండా దాచిపెట్టిన టీటీడీ
- గోధర్మం కాపాడలేని వారు... గోవిందుని ధర్మం కాపాడగలరా?
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై సమాధానం చెప్పాలి
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్



**తిరుపతి:** ప్రపంచంలోనే అత్యంత పవిత్రక్షేత్రమైన తిరుమలలో టీటీడీ నిర్లక్ష్యం కారణంగా చోటుచేసుకున్న మహాపాతకంకు సంబంధించిన సంచలన వాస్తవాలను టీటీడీ మాజీ చైర్మన్, వైయస్‌ఆర్‌సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి బయటపెట్టారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీటీడీ గోశాలలో మూడు నెలల్లోనే వందకు పైగా గోవులు అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డ వైనంకు సంబంధించిన వివరాలను మీడియా ముందుకు తెచ్చారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తరువాత వరుసగా జరుగుతున్న ఈ గోమరణాలను టీటీడీ ఎందుకు దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. మొత్తం హిందూసమాజం అత్యంత పవిత్రమైనది భావించే గోవులకు టీటీడీ గోశాలలో దుర్భరమైన పరిస్థితులు ఉన్నాయని, మిగతా.. 2లో

భవిష్యత్ అవసరాలకు

# తగినట్లుగా డ్రైపోర్ట్

- ఆర్‌ఆర్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి..
- ఎన్‌హెచ్‌ల భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- ఆర్‌ఆర్‌ఆర్,ఎన్‌హెచ్‌లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం... ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమీక్ష నిర్వహించారు.

ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడగ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు.

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్‌ఏఐ) పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించడం లేదని మిగతా.. 2లో



## నాయకా.. పారిపో.. పారిపో!

- 'సుప్రీం'కు వెళ్లే దాకా వదిలేసిన 'సూపర్ పోలీస్'!
- కిరణ్‌ను కనిపెట్టిన సిగ్నల్స్ ఆ ముగ్గురినీ కనిపెట్టలేకపోయాయా?
- కాకాణి, మిథున్‌రెడ్డి, డాక్టర్ ప్రభావతిలను వదిలేసిన పోలీసులు
- హైకోర్టులో బెయిల్ పిటిషన్ కొట్టేసిన వైనం
- వెంటనే అరెస్టుకు వేటాడని పోలీసు బాసులు
- ఆలోగా సుప్రీంకోర్టుకు వెళ్లి సేఫ్ అయిన వైకాపా నేతలు
- ఈలోగా కాకాణి ఖాకీల కళ్లు గప్పి పరాయిన కాకాణి
- మిథున్, పెద్దిరెడ్డిని ఎవరు రక్షిస్తున్నారంటూ తమ్ముళ్ల ఫైర్
- టీడీపీ అధికారంలో ఉన్నా చిత్తూరు, అన్నమయ్యలో ఇంకా పెద్దిరెడ్డి హవానా? హవ్వ!
- జగన్ హయాంలో టీడీపీ నేతలను ఖాకీలు ఇలాగే వదిలేశారా?
- హైదరాబాద్ వెళ్లి రఘురామరాజును ఎత్తుకొచ్చిన పోలీసులు
- ఆ తెగువ ఇప్పుడు ఏదంటూ పసుపు సైనికుల ఫైర్

7లో

రూపాయి ఖర్చు లేకుండా

# పట్టా రిజిస్ట్రేషన్

- రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తాం
- 2019లో అనేక రకాలుగా అవమానించారు
- మంగళగిరి ప్రజలు నా గౌరవం నిలబెట్టారు
- మంగళగిరిలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



**మంగళగిరి, మహానాడు:** వచ్చే వారం నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు కూడా వస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మధ్యాహ్నం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. శుక్రవారం మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మిగతా.. 4లో

### యుద్ధప్రాతిపదికన మంగళగిరి హామీలు అమలు

13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది

అంతర్జాతీయ ప్రమాణాలతో నియోజకవర్గంలో మొదటి పాఠశాల

నాలుగో రోజు 600 ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్

9లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 12, ఏప్రిల్ 2025 ‖

## భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా డ్రైపోర్ట్

**మొదటి పేజీ తరువాయి..**

అధికారులు సీఎంకు వివరించారు.

పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు.

ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు.. ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ముఖ్య ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.





## గోరంట్లకు ప్రేమతో..

**మొదటి పేజీ తరువాయి..**

ఏమిటి?

పిల్లి గుడ్డిదయితే ఎలుక ఏదో చూపించిందన్నది ముతక సామెత. గుంటూరులో గోరంట్ల దాదాగిరి చూసిన తర్వాత.. తెలుగు తమ్ముళ్ల మనసులో బలంగా నాటుకుపోయిన భావన ఇది. టీడీపీ అధికారంలో ఉందన్న స్పృహ, భయం లేకుండా.. ఏకంగా పోలీసులపైనే తెగబడిన గోరంట్ల దౌర్జన్యం పరిశీలిస్తే, ముఖ్యమంత్రిగా ఎవరున్నారు? వైసీపీ అధికారంలో ఉందా? టీడీపీ అధికారంలో ఉందా? అన్న అనుమానం రావడం సహజం. ఇప్పుడు జరుగుతోంది అదే.



సరే.. వైఎస్ భారతీరెడ్డిపై అసభ్యకరంగా పోస్టింగులు పెట్టిన చేబ్రోలు కిరణ్ అనే టీడీపీ కార్యకర్తపై బిఎన్ఎస్ 111 సెక్షన్ పెట్టి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కిరణ్‌ను కోర్టులో ప్రవేశపెట్టిన సందర్భంలో జడ్జి పోలీసులపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఇష్టానుసారం సెక్షన్లు పెట్టిచట్టాన్ని అపహాస్యం చేస్తారా? ఈ కేసులో 111 సెక్షన్ ఎలా పెడతారు? అంటూ కన్నెర్ర చేసిన జడ్జి.. మంగళగిరి సీఐ శ్రీనివాసరావుకు చార్జిమెమో ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు.

దాన్నలా పక్కనపెడితే.. నిందితులకు ముసుగువేసిన వైనం విమర్శలపాలవుతోంది. నిందితుడైన టీడీపీ కార్యకర్త తలకు నల్లక్యారీబాగును తగిలించి, మీడియా ముందు ప్రవే శపెట్టిన వైనంపై పసుపుసైనికులు భగ్గుమంటున్నారు. కిరణ్ ఏమైనా దేశద్రోహినా? టెర్రరిస్టా? హంతకుడా? మరి మరి వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళికి ఎందుకు ముసుగు వేయలేదు? అని పోలీసులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

కిరణ్‌తోపాటు.. మాధవ్ సహ నిందితులయిన నలుగురుకి ముసుగువేసిన పోలీసులు, అదే కేసులో నిందితుడైన గోరంట్ల మాధవ్‌కు ముసుగు వేయకపోగా.. కారులోనే కూర్చునే అవకాశం కల్పించిన, గుంటూరు 'మంచి పోలీసుల విశాల హృదయం'పై పసుపు సైనికులు విరుచుకుపడుతున్నారు.

తొలుత ముసుగు వేసేందుకు ప్రయత్నించిన పోలీసులపై, మాధవ్ ఆగ్రహం వ్యక్తంచేసి రూల్సు మాట్లాడగా, భయపడిన పోలీసులు వెనుకంజ వేసినట్లు సమాచారం. మరి కిరణ్ సహా ఐదుగురికి ముసుగులేసి మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు, మాధవ్‌కు మినహాయింపు ఎలా ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? అసలు ముసుగులు వేయాలని ఆదేశించిన అధికారి ఎవరన్నది తేలాల్సిన ప్రశ్నలు. నిందితులకు ముసుగు వేయకూడదన్న సుప్రీంకోర్టు రూలింగ్‌ను ఉల్లంఘించి ఎవరన్నది మరో ప్రశ్న.

నేను పోలీసు ఆఫీసర్‌ను.. మాజీ ఎంపీని అని గోరంట్ల గుడ్లురిమితే, గుంటూరు పోలీసులు గజగజ వణికిపోయి.. చిత్తం ప్రభూ అని సారుకు, సాగిలపడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోరంట్ల మాధవ్ ఇప్పుడు నిందితుడు. ఆయన ప్రస్తుత ఎంపి కాదు. మాజీ పోలీసు అధికారి. అదికూడా రాజీనామా ఇచ్చిన వ్యక్తి. మరి అలాంటి నిందితుడికి చట్టంలో ఏమైనా ప్రత్యేక హక్కులుంటాయా? అని ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు.

పైగా మాధవ్‌కు ఒక సీఐ స్వయంగా తన ఫోన్ ఇచ్చి మాట్లాడుకునే వెసులుబాటు కల్పించారని, స్పెషల్ బ్రాంచిలో ఉన్న వైసీపీ అభిమానులు, కిరణ్ ఉన్న రూట్‌మ్యాప్‌ను మాధవ్‌కు అందచేశారన్నది మరో ఆరోపణ. గుంటూరు జిల్లాలో ఎస్‌బీ అధికారుల ఫోన్లపై నిఘా వేస్తే, ఇంటిదొంగలెవరో తేలుతుందన్నది తమ్ముళ్ల డిమాండ్.

## తిరుమల క్షేత్రంలో మహా పాతకం

**మొదటి పేజీ తరువాయి..**

వరుస గోమరణాలపై తక్షణం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే...

దేశంలో గోవును అత్యంత పవిత్రమైన జంతువుగా హిందువులు పూజిస్తుంటారు. అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని గోశాలలో సకల దేవతల స్వరూపిణీ అయినటువంటి గోమాతకు దారుణమైన పరిస్తితి దాపురించింది.

హైందవ ధర్మాన్ని కాపాడతామని, తిరులమ పవిత్రతను రక్షించడమే ధ్యేయంగా పాపప్రక్షాళన చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రభుత్వంలో టీటీడీ గోశాలలో గత మూడు నెలల్లో దాదాపు వందకు పైగా గోవులు మృత్యువాత పడ్డాయి. దీనిని బయటకు రానివ్వకుండా దాచిపెట్టారు. గోవులు తాకితే, గోప్రదక్షిణ చేస్తేనే పుణ్యం లభిస్తుందని హిందువులు భావిస్తుంటారు. శ్రీవారి ఆలయ పరిరక్షణలో, సాక్షాత్తు వెంకటేశ్వరస్వామికే గోక్షీరాన్ని ఇచ్చిన గోమాతను మరింత పవిత్రమైనదిగా పూజిస్తుంటారు.

ఆ గోవును అదిలించేందుకు గోపాలుడు విసిరిన గొడ్డలి దెబ్బ నుంచి గోవును రక్షించేందుకు స్వామివారే అడ్డపడి, ఆ దెబ్బను కాచుకున్న ఉదంతం కూడా మన పురాణాలు చెబుతున్నాయి. అలాగే శ్రీవారి ఆలయ తలుపులు తెరిచేది కూడా గోసంరక్షకుడే. అంత పవిత్రమైన గోవును తిరుమల క్షేత్రంలో ఎంతో పుణ్యప్రధమైనదిగా పూజిస్తుంటారు. అలాంటి గోవులకు తిరుమల క్షేత్రంలో ఎటువంటి దుస్థితి దాపురించిందో ప్రజలకు తెలియచేసేందుకు ఈ మీడియా సమావేశంలో వాటి దుస్థితికి అద్దం పట్టే ఫోటోలను ప్రదర్శిస్తున్నాం.

దేశవాళీ ఆవులు ఎంత దారుణంగా మృత్యువాత పడ్డాయి, వాటిని ఏ రకంగా టీటీడీ గోశాల నిర్వాహకులు వదిలేశారనే దానికి సంబంధించిన ఫోటోలను కూడా ఈ మీడియా సమావేశంలో మొత్తం ప్రజలంతా చూసేందుకు గానూ ప్రదర్శిస్తున్నాం. అర్థాంతరంగా ఎన్ని ఆవులు ఎలా చనిపోయాయో తెలుసుకునేందుకు కనీసం పోస్ట్‌మార్టం కూడా నిర్వహించలేదు. వందకు పైగా ఆవులు మృత్యువాత పడుతుంటే అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఒక డీఎఫ్ఓ స్థాయి అధికారిని గోశాలకు ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనకు గోపరిరక్షణకు ఎటువంటి సంబంధం లేదు. వీటిమీద వెంటనే విచారణ జరిపించాలి. కొండమీద ఇంత దారుణాలు జరుగుతుంటే, వాస్తవాలను బయటకు రానివ్వకుండా దాచిపెడుతున్నారు.

### వైఎస్ జగన్ హయాంలో గోమాతకు అత్యున్నత స్థానం

వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా గత అయిదేళ్ళ పాలనలో తిరుమల క్షేత్ర పవిత్రతను, గోమాత గొప్పదనంను అత్యున్నత స్థానంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్వామి వారి కైంకర్యాలకు స్వచ్ఛమైన పాలు, వెన్న, నెయ్యిని అందించేందుకోసం 550 నాణ్యమైన, ఉన్నత జాతి దేశవాళీ ఆవులను దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసి ఇక్కడ ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాం.

ఇందుకోసం సాహీవాల్, గిర్, కాంకీర్ వంటి జాతుల ఆవులను గుజరాత్, పంజాబ్, రాజస్తాన్ నుంచి సమీకరించి అప్పటి రైల్వేశాఖ మంత్రితో చర్చించి రైలుమార్గంలో వాటిని సురక్షితంగా తిరుమలకు తరలించాం. స్వామివారికి నిత్యం 1500 లీటర్ల పాలను కైంకర్యాలకు వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ టీటీడీ గోశాల నుంచి నిత్యం వంద కేజీల స్వచ్ఛమైన నెయ్యిని స్వామివారికి అందించాలనే లక్ష్యంతోనే వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఈ గోశాలలో మేలుజాతి దేశీయ ఆవులను తీసుకువచ్చింది.

ఈ ఆవుల నుంచి వచ్చే పాలను కూడా సంప్రదాయ కవ్వంతో చిలికి, దాని ద్వారా వెన్నను తీసేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇందుకోసం దాదాపు రూ.5 కోట్లను ఖర్చు చేశాం. నేడు కూటమి ప్రభుత్వంలో దానిని పట్టించుకునే నాథుడు లేదు. స్వచ్ఛమైన నెయ్యినే స్వామి వారి కైంకర్యాలకు వినియోగించాలనే మంచి లక్ష్యంతో వైయస్ జగన్ గారి ప్రభుత్వం శ్రీవారిపై ఎంతో భక్తిప్రవక్తులతో ఈ చర్యలు తీసుకుంది. దాదాపు రెండువేల ఆవులను రైతు సాధికారిత సంస్థ ద్వారా గోశాల నుంచి రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

వాటిని రైతులు ఎంతో జాగ్రత్తగా పోషిస్తున్నారు. రోజుకు 15వేల కేజీల నెయ్యి సాధించాలనే లక్ష్యంతో ఈ బ్రీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. కవ్వంతో చిలికి వెన్న, తద్వారా నెయ్యిని తీసే కార్యక్రమాన్ని చేశాం.మొట్టమొదటిసారిగా స్వామివారికి నవనీత సేవను తీసుకువచ్చాం. శ్రీవారి సేవకుల ద్వారా నలభై గిర్ ఆవుల నుంచి పాలను కాచి, దాని నుంచి వెన్నను తీసి నవనీత సేవలకు వినియోగిస్తున్నాం.

శ్రీవారి పట్ల, పవిత్రమైన గోవుల పట్ల వైయస్ జగన్ గారికి ఉన్న చిత్తశుద్ధి అది. వైయస్ రాజశేఖరరెడ్డి గారి హయాంలో దేశంలోని హైందవ ధార్మికులను పిలిచి మూడు రోజుల పాటు వందే గోమాతరం పేరుతో సదస్సు నిర్వహించాం. నిపుణులతో గోవును ఎలా రక్షించుకోవాలనే దానిపై సదస్సులను నిర్వహించాం.

గోమూత్రం, గోమయంతో సుగంధ ద్రవ్యాలను తయారు చేశాం. వాటిని భక్తులకు విక్రయించడం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించి, గోశాల కోసం వినియోగించాం. గోఆధారిత ఉత్పత్తులతో పదిహేను రకాల వస్తువులను తయారు చేసి భక్తులకు విక్రయించాం. దాదాపు రూ.యాభై కోట్ల వ్యాపారం అగర్‌బత్తీలు, సుగంధ ద్రవ్యాలు, పంచగవ్య ఉత్పత్తుల విక్రయం ద్వారా టీటీడీకి లభించింది.

### రూ.50 కోట్లతో మేలుజాతి ఆవుల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు

ఎన్‌డీడీపీ వారి సహకారంలో రూ.50 కోట్లతో సాహీవాల్, కాంకేర్, గిర్, బాహుబలి ఆవుల పునరుత్పత్తి కేంద్రాన్ని తిరుపతిలో ఏర్పాటు చేశాం. దాదాపు పూర్తి కావొచ్చిన ఈ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూలనపడేశారు. మంచి బ్రీడింగ్ ద్వారా గోఆధారిత పంటలను ప్రోత్సహించడానికి, ఏపీలో ఒక కొత్త ఉద్యమాన్ని వెంకటేశ్వరస్వామి ఆలయం ద్వారా చేయాలనే లక్ష్యంతో గత సీఎం వైయస్ జగన్ గారి ఆదేశాల మేరకు టీటీడీ బోర్డ్ చర్యలు తీసుకుంది.

ఎన్డీడీపీ చైర్మన్‌ను తీసుకువచ్చి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్లాంట్‌ను పెట్టేందుకు కృషి చేశాం. మంచి బ్రీడింగ్ ద్వారా దేశవాళీ ఆవులను ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని సంకల్పించాం. ఈ ఆవుల నుంచి శ్రీవారి సేవలు, లడ్డూ ప్రసాదం కోసం రోజుకు 15000 కేజీల స్వచ్ఛమైన నెయ్యిని రైతుల నుంచి సమీకరించాలనే ఆశయంతో వైయస్ జగన్ గారి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నేడు ఈ కేంద్రంను గురించి పట్టించుకునే వారు లేరు. వైయస్ జగన్ ప్రభుత్వం శ్రీవారి కోసం చేసిన ప్రతి మంచిపనినీ తుడిచేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.

### టీటీడీ గోశాలలో నేడు దుర్భర పరిస్థితులు

వైయస్ జగన్ ప్రభుత్వంలో ఎంతో ఘనంగా నిర్వహించిన టీటీడీ గోశాల నేడు మృత్యుఘోషతో కనిపిస్తోంది. నిత్యం గోవులు మరణిస్తున్నాయి. కనీసం పోషకాహారం లేక గోవులు బక్కచిక్కి దుర్భరంగా జీవిస్తున్నాయి కనీసం రోజుకు 500 లీటర్ల పాలు కూడా కొండకు వెళ్ళడం లేదు. అనారోగ్యంతో ఉన్న గోవులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. ఇద్దరు వైద్యులు, ఇద్దరు కాంపౌండర్లతో కాలం వెళ్ళదీస్తున్నారు. కనీసం పూర్తిస్తాయి గోశాల పరిరక్షక అధికారి నియామకం లేదు. వేరే విభాగానికి సంబంధించిన అటవీశాఖ అధికారిని గోశాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. గోవులకు అందిస్తున్న దాణా కూడా చెత్త పడేసినట్లుగా వేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ఇటీవలే సాహీవాల్ జాతికి చెందిన గర్భంతో ఉన్న గోవు గోశాల నుంచి తప్పించుకుని వెళ్ళి రైలు కింద పడి ఆవు, దాని గర్భంలోని దూడ కూడా మరణించాయి. అవి టీటీడీకి సంబంధించినవి అని తెలియకుండా ఉండేందుకు చనిపోయిన గోవుల చెవులకు ఉన్న ట్యాగ్‌లను కనిపించ కుండా చెవులను కూడా కత్తిరించిన దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు నెలల్లో వందకు పైగా గోవులు చనిపోతుంటే, ఎందుకు అవి మృత్యువాత పడుతున్నాయో తెలుసుకునేందుకు కనీసం పోస్ట్‌మార్టం కూడా నిర్వహించలేదు. చనిపోయిన వాటిని గుప్పుచప్పుడు కాకుండా చేసే ప్రయత్నం జరిగింది. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి. గోవుల మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి. గోశాలకు పూర్తిస్థాయి అధికారిని నియమించాలి. దారుణ స్థితిలో ఉన్న గోవులకు సత్వర వైద్యం జరిపించాలి. గోదాణా విషయంలో జరుగుతున్న అవకతవకలను సరిచేయాలి.

### గోమాత పట్ల జరుగుతున్న పాపంకు బదులేది?

టీటీడీ గోశాలలో గోమాత పట్ల జరుగుతున్న పాపంకు ముఖ్యమంత్రి చంద్రబాబు, సనాతన ధర్మపరిరక్షణకు కంకణం కట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బదులు చెప్పాలి. నిత్యం వైయస్ జగన్ గారిపైన విషం చిమ్మడంలోనే వీరు నిమగ్నమయ్యారు. తిరుమల శ్రీవారిని కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ గత ప్రభుత్వంపై చెప్పలేనంత బురదచల్లే ప్రయత్నం చేశారు.

ఈ రోజు వారి ప్రభుత్వంలో గోమాతకు జరుగుతున్న అపచారం పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉన్న హిందూసంఘాలు స్పందించాలి. గో పరిరక్షణకు ముందుకు రావాలి.

## సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించం

**అమరావతి:** రాష్ట్రంలో సుపరిపాలన అందించేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని, నాపైన ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెడతాననే విశ్వాసం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కొత్త కాదని, సమైక్యాంధ్రలో తాను చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తనకు వేరే ఆశలు లేవని, మీ ప్రేమాభిమానాలు ఉంటే చాలని అన్నారు. మీ ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని చెప్పినట్టే రుజువు చేస్తున్నానని చెప్పారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో జరిగిన మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడారు.

### చరిత్ర మరిచిపోలేని గొప్ప వ్యక్తి పూలే :

చరిత్రలో శాశ్వతంగా నిలిచేపోయే చాలా కొద్ది మంది వ్యక్తుల్లో జ్యోతిరావు పూలే ఒకరు. బడుగు బలహీనవర్గాల ఆరాధ్య దైవం ఆయన. 198 ఏళ్లయినా ఇంకా పూలే జయంతి జరుపుకుంటున్నామంటే అదే ఆయన మనకు ఇచ్చిన స్ఫూర్తి. స్త్రీ విద్యకు ఆ రోజుల్లోనే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. తన సతీమణిని ప్రోత్సహించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేశారు. బాల్య వివాహాలు, సతీసహగమనాలకు వ్యతిరేకంగా పోరాడారు. రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశారు. అంబేద్కర్ సైతం ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడిచారంటే పూలే గొప్పతనం అర్థం చేసుకోవచ్చు.

### రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసింది ఎన్టీఆర్

పూలే బాటలోనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్రంలో మహిళా విద్యకు పెద్దపీట వేసి ఏకంగా మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించే వరకు బీసీలకు న్యాయం జరగలేదు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటగా గుర్తించింది ఎన్టీఆర్. రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ. టీడీపీకి వెన్నుముక బీసీలు... బీసీలను ఆదరించే బాధ్యత టీడీపీది. తనతో సహ ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... ఇలా అందరం బీసీల కోసం ఆలోచిస్తున్నాం... వారి కోసం పనిచేస్తున్నాం.

### బీసీల రక్షణ బాధ్యత టీడీపీది


అట్రాసిటీ యాక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఎలా అయితే రక్షణ కల్పిస్తున్నామో, త్వరలో బీసీల కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకువస్తాం. దీనిపై సబ్ కమిటీ వేశాం. ఆ నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీలకు మేం 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే, గత ప్రభుత్వ హయాంలో 24 శాతానికి తగ్గించారు. మేం మళ్లీ 34 శాతానికి మళ్లీ రిజర్వేషన్ పెంచుతాం. నామినేటెడ్ పోస్టుల్లో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేస్తాం.

### బీసీలకు ఎంతో చేశాం... ఇంకా చేస్తాం

నాయి బ్రాహ్మిణ్ ఫెడరేషన్, ఎంబీసీ ఫెడరేషన్, బీసీలకు కార్పోరేషన్లు, బీసీ భవన్‌లు, బీసీలకు ప్రత్యేక ప్రణాళిక, బీసీ విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూళ్లు, మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్లు, విదేశాల్లో చదువుకునేలా రూ.15 లక్షలు ఒక్కో విద్యార్థికి ఆర్థిక సాయం, పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కోచింగ్, అలాగే బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసింది టీడీపీ. డీఎస్సీకి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ప్రతి జిల్లా నుంచి 220 మందికి కోచింగ్ అందిస్తాం. ఆదరణ-3ని తీసుకువస్తాం.







### బీసీల ఆదాయం పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు :

బీసీల కులవృత్తులు దెబ్బతిన్నాయి. వారి ఆదాయం పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకువస్తున్నాం. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తున్నాం. నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకు



సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు 2 కిలోవాట్లకు రూ.80,000, 3 కిలోవాట్లకు రూ.98 వేలు ప్రత్యేకంగా సబ్సిడీ ఇస్తున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయిబ్రాహ్మిణ్‌లకు రూ.15,000 ఉన్న వేతనాన్ని రూ.25,000 వేలు చేశాం.

### ఆగిరిపల్లిలోనూ అన్నా క్యాంటిన్ :

అందరి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటిన్లు పెట్టాం. మీ గ్రామంలోనూ త్వరలోనే అన్నా క్యాంటిన్ పెడతాం. డ్వాక్రా సంఘాలు నా మానస పుత్రికలు... లక్ష మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలు చేయాలనుకుంటున్నా. మా అమ్మ కష్టాలు ఎవరికీ కలుగకూడదని దీపం-2 పథకం కింద ఉచితంగా 3 సిలండర్లు ఏడాదికి ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15,000 చొప్పున ఇస్తాం. అన్నదాతలకు మే నెల నుంచి ఏడాది రూ. 20,000 ఇస్తాం. అలాగే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో పరిహారం ఇస్తాం. సంపద సృష్టించి సంక్షేమానికి ఖర్చు పెడతాం. అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రం మరింత నష్టపోతుంది.

### పార్థసారధికి అండగా ఉంటాను :

నూజివీడు నియోజవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే వరకు మంత్రి పార్థసారధికి అండగా ఉంటాను. నూజివీడులో జనాభావృద్ధి కూడా తగ్గుతోందని, ప్రతి దంపతులు కనీసం ఇద్దరు చొప్పున పిల్లల్ని కనాలి. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో కోర్టు వివాదాల్లో చిక్కుకుపోయింది. మేము ఆ వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చూసి... ప్రాజెక్టు పూర్తి చేస్తాం.

### స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు

సోషల్ మీడియా నేరస్తులకు అడ్డాగా మారింది. సోషల్ మీడియా ద్వారా ఎవరి వ్యక్తిత్వ హననం చేసినా వాళ్లకు అదే చివరి రోజు అవుతుంది. పిల్లలను మంచి పౌరులుగా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలి. తప్పు చేసిన వాళ్ల విషయంలో చంఢశాసనుడిగా ఉంటా.

వివేకానంద రెడ్డిది గుండెపోటు అని మొదట జరిగిన ప్రచారాన్ని నమ్మి మోసపోయా, తర్వాత తెలిసింది అది గొడ్డలి పోటు అని. తప్పుడు ప్రచారం చేసినా, తప్పుగా మాట్లాడినా చర్యలు తప్పవు. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ స్వేచ్ఛగా తిరగలేదు. మా ప్రభుత్వంలో ఇచ్చిన స్వేచ్ఛను ఎవరూ దుర్వినియోగం చేసుకోకండి.











జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025




## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనుల వేగవంతం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్తో పాటు మీర్ అలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు.

మీర్ అలం ట్యాంక్పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ తో పాటు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్లో వివిధ చోట్ల ఐలాండ్లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్ కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు.

బోటింగ్ తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హెూటల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్ లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్ ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

మీర్ అలం ట్యాంక్లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ తో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

మీర్ అలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవలప్మెంట్ ప్లాన్ను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్ గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు.

## ప్రజలను బిచ్చగాళ్లుగా మార్చిన రేవంత్ పాలన

- ఫీజు రీఇంబర్స్మెంట్ లేక రోడ్డున పడ్డ విద్యార్థులు
- పూలేకు పూలదండ కాదు.. ఆయన ఆశయాలు అమలు చేయండి
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్
- పూలే ఆశయాలకు విరుద్ధంగా తెలంగాణలో పాలన
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్: "మహాత్ములకు నివాళులు అర్పించడమంటే వారి జయంతి, వర్ధంతిలను ఘనంగా నిర్వహించుకోవడమే కాదు. వారి ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడమనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి"అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలె జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, కోశాధికారి శాంతకుమార్, అధికార ప్రతినిధి జె.సంగప్ప పూలె చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే.. అణచివేత పై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.... బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతిరావు పూలె. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ను అభిమానించే జ్యోతిరావు పూలె కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారు. ఆరోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారు.

"దీనబంధు" అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహెూన్నతుడు జ్యోతిబా పూలె. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలెను గురువుగా ప్రకటించుకున్నారంటే, ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుంది.సతీమణి సావిత్రీబాయి పూలెతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఆనాడే ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జానాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలె. స్వాతంత్ర్యంరాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు చేసిన కృషి చిరస్మరణీయం.

మన దురదృష్టమేమిటంటే...జ్యోతిరావు పూలే ఆశయాలకు విరుద్ధంగా తెలంగాణలో పాలన సాగుతోంది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉంటే నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలనా పుణ్యమా అని రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచారు. ప్రజలు బిచ్చమెత్తుకునే దుస్థితికి తీసుకొచ్చారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే పూలే మహానుభావుడు అక్షర వెలుగులు




నింపితే... కానీ మన తెలంగాణలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా వెనక్కు నెట్టేశారు. ఇయాళ తెలంగాణలో నూటికి 34 మంది ఇంకా చదువుకు నోచుకోని వాళ్లున్నారు. ఇగ మహిళల సంగతి చెప్పనక్కర్లేదు. నూటికి 40 మందికిపైగా చదువుకు దూరంగా ఉన్నారంటే పరిస్థితిని అర్ధం చేసుకోవచ్చు.

దళిత, బడుగు బలహీనర్గాల పేదలకు విద్య, వైద్యం అందకుండా పోయే పరిస్థితి దాపురించింది. ఏళ్ల తరబడి ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమైతున్నారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగా వేలాది కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో అటు విద్యార్థులు చదువుకు దూరమయ్యారు.

ప్రైవేటు కాలేజీలు మూసివేసుకునే దౌర్భాగ్య స్థితి ఏర్పడినా పట్టించుకోని దౌర్భాగ్య పాలన కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే చదువుకునే ప్రతి విద్యార్థికి 5 లక్షల రూపాయల భరోసా కార్డు ఇస్తామని, ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వాటిని గాలికొదిలేసింది. 6 గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను నట్టేట ముంచింది.

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలన్నీ చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు ఢోకా లేకుండా చర్యలు తీసుకోవాలి. వంద శాతం అక్షరాస్యత దిశగా క్రుషి చేయాలి. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.




## నేటి బంగారు కుటుంబాలే... రేపటి మార్గదర్శులు

- సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలి
- ఆగిరిపల్లి 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

నూజివీడు/ఆగిరిపల్లి: సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి పిలుపునిచ్చారు. పేద కుటుంబాల్లో వెలుగు తెచ్చేవరకు అండగా ఉంటానని, నేడు బంగారు కుటుంబానికి ఎంపికైన వారి పిల్లలే సహకారం అందిస్తే రేపు మార్గదర్శుకులుగా తయారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తగ్గాలని అభిప్రాయపడ్డారు. ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం, ఆగిరిపల్లిలో



జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బంగారు కటుంబం-మార్గదర్శి కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను సీఎం సన్మానించారు.

అనంతరం మాట్లాడుతూ....ఆగిరిపల్లిలోని 206 బంగారు కుటుంబాలకు వారి మార్గదర్శులు అండగా ఉంటారు. మొదటి దశలో రాష్ట్రంలోని 20 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. పేదలను ఆదుకుని శాశ్వతంగా పైకి తీసుకొస్తే పూలేను గుర్తుపెట్టుకున్నట్లుగానే మార్గదర్శుకులను గుర్తుంచుకుంటారు. ఒక స్థాయి వరకు సొంతానికి, వ్యక్తిగతంగా కష్టపడతాం.

తర్వాత మంచి పేరు కోసం కష్టపడతాం. అలాంటి వేదిక కోసమే ఈ మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమం. మార్గదర్శకులు ఓట్లు కోసం రావడం లేదు, పేరు కోసం ముందుకు వస్తున్నారు. అంబేద్కర్, పూలే, జగ్జీవన్ లాంటి మహానుభావుల జయంతి వేడుకులు నిర్వహించుకుంటూనే పీ4 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### బంగారు కుటుంబాలకు ఎంపికైన వారు మాట్లాడుతూ...

ప్యారీ రేష్మ, ఆగిరిపల్లి: నా భర్త డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మాకు సొంతిల్లు



లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. మా ముగ్గురు పిల్లన్ని చదివించుకోవడానికి సాయం కోరుతున్నాను. ఆస్తులు ఏమీ లేవు.

బోనం లక్ష్మీదుర్గా, ఆగిరిపల్లి

నా భర్త బోన్ క్యాన్సర్‌తో మూడేళ్ల క్రితం చనిపోయారు. నాకు పింఛన్ కూడా రావడం లేదు. నాకు పాప, బాబు ఉన్నారు. సొంతిల్లు లేక నా తల్లిదండ్రులతో ఉంటున్నాను. పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్తున్నాను. జీవనోపాది కల్పించాలని కోరుతున్నా.

**సీఎం: వచ్చే నెల నుంచే మీకు పింఛను మంజూరు చేయడంతో పాటు 12 నెలల పింఛను కూడా ఇస్తాం. సొంతిల్లు కూడా కట్టించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటాం.**

### మార్గదర్శకులు మాట్లాడుతూ...

ప్రభాకర్, నూజివీడు సీడ్స్ అధినేత: మార్గదర్శి-బంగారు కుటుంబం చాలా మంచి కార్యక్రమం. దేశంలో ఎక్కడా లేని మంచి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. రాబోయే నాలుగేళ్లలో రూ.20 నుంచి 25 కోట్ల వరకూ ఆగిరిపల్లిలోని పేదలకు ఖర్చు చేస్తాం. ఆగిరిపల్లితో పాటు తుక్కులూరు గ్రామంలో కూడా ఈ కార్యక్రమాన్ని చేపడితే ముందుకొస్తాం.

సిద్ధార్థ, కుశలవ గ్రూప్: చదువుకోవడానికి ఇబ్బంది పడేవారికి సాయం అందిస్తాం. ఇల్లు లేని వారికి ప్రభుత్వం స్థం కేటాయిస్తే ఇల్లు నిర్మించి ఇస్తాం.

గౌతమ్, హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత: నేను స్థాపించి హ్యాపీవ్యాలీ స్కూల్‌ను మీరే ప్రారంభించారు. వంద కోట్లు అప్పు చేసి స్కూలు కట్టించాను. ఆ అప్పంతా తీర్చాను. 300 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. వారు మంచి జీవితాన్ని ప్రారంభించేదాకా బాధ్యత తీసుకుంటాం. మీ ఇచ్చే పిలుపుతో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

నితిన్ కృష్ణ, నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్: ఈ కార్యక్రమం ద్వారా మట్టిలో ఆణిముత్యాలను వెలికి తీసి ఉద్యోగాలు ఇస్తాం.

పిన్నమనేని ధన ప్రకాశ్, మోడల్ డైరీ: హీల్ అనే పాఠశాల ద్వారా వెయ్యి మంది విద్యార్థులకు చదువు అందిస్తున్నాం. అనాథ పిల్లలను తీసుకుని చదివిస్తాం.

రావి వెంకటరావు, ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్: నాకు మార్గదర్శి సీఎం చంద్రబాబు. చంద్రబాబు చెప్పి చేసేవన్నీ చూసి నేర్చు కున్నాం. 60 మందితో ప్రారంభమైన మా కాలేజీలో నేడు 6 వేల మంది ఉన్నారు. ఎక్కువమంది కటుంబాలను దత్తత తీసుకునేందుకు ప్రయత్నిస్తాం.

## గుంటూరు- పల్నాడు- హైదరాబాద్‌కు నాలుగు లైన్ల నేషనల్ హైవే

- రూ.1,064 కోట్లతో ఏపీలో శ్రీకారం

(శివ శంకర్ చలువాది)

ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన నేషనల్ హైవేల పనులు వేగవంతం అయ్యాయి.. పల్నాడు జిల్లా నుంచి గుంటూరు జిల్లా మీదుగా బాపట్ల



జిల్లాకు వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు 167ఏ జాతీయ రహదారి రూ.1,064.24 కోట్లతో నిర్మాణం జరుగుతోంది.. ఈ ఏడాది ఆఖరికి హైవే పూర్తవుతుందని భావిస్తున్నారు.

నేషనల్ హైవే 167ఏ వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మాణం వేగంగా సాగుతోంది. ఈ హైవే వాడరేవు నుంచి కారంచేడు, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల దగ్గర నకరికల్లు అడ్డరోడ్డు వరకు నిర్మాణం కొనసాగుతోంది.

బాపట్ల జిల్లాలో దాదాపు 45 కిలోమీటర్ల మేర ఈ హైవే ఉండనుంది. ఈ రోడ్డు పూర్తయితే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి హైదరాబాద్‌కు త్వరగా వెళ్లొచ్చు. అలాగే తెలంగాణ వైపు నుంచి చీరాల తీర ప్రాంతానికి పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇదిలా ఉంటే రైతుల నష్టపరిహారం అంశంపై అధికారులు స్పందించారు. భూసేకరణ జరగగానే యజమానులకు పరిహారంపై నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు.

గతంలో పరిహారం ఆలస్యమైందని.. కానీ కొంతకాలంగా రైతుల బ్యాంక్ అకౌంట్‌లలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు దఫాల్లో పరిహారం అందజేశామని.. కోర్టు వివాదాలు, అగ్రిమెంట్‌లను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. త్వరలోనే తప్పకుండా అందరికీ పరిహారం అందేలా చేస్తామంటున్నారు.

## కేటీఆర్.. బాంబు పేలుస్తనంటివే ఏదీ?

- ఉల్లిగడ్డ బాంబు కూడా పేలలేదే..
- ఆ ఎంపి పేరు చెబుతానంటివి కదా?
- కేటీఆర్ హెచ్‌సియు భూముల గడువుపై కాంగ్రెస్ ఎంపి చామల వ్యంగ్యాస్త్రం

హైదరాబాద్: కేటీఆర్ హైడ్రోజన్ బాంబు వేస్తే దాని వల్ల ఎన్ని ప్రాణాలు పోతాయో, దేశం ఎంత అల్లకల్లోలమవుతుందోనని ఆందోళన చెందామని, చివరకు ఉల్లిగడ్డ బాంబు కూడా వేయలేకపోయారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ ఎద్దేవా చేశారు. ఎవరో ఒక ఎంపీ ఈ భూముల వ్యవహారం వెనుక ఉన్నాడని చెప్పిన కేటీఆర్, ఆ ఎంపీ పేరు మాత్రం చెప్పడం లేదని విమర్శించారు.

కంచ గచ్చిబౌలి భూముల కుంభకోణాన్ని 48 గంటల్లో బయటపెడతానని సవాల్ చేసిన కేటీఆర్, ఇప్పటి వరకు చేసిందేమీ లేదని అన్నారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారం వెనుక రూ. 10 వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చామల



ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. బిల్లీరావుతో కలిసి ఈ భూములను కేటీఆర్ కాజేయాలనుకున్నారని ఆరోపించారు.

## సీఎం పిలుపుతో స్వచ్ఛాంధ్ర వైపు అడుగులు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మహానాడు: సీఎం చంద్రబాబు పిలుపుతో స్వచ్ఛంధ్ర వైపు అడుగులు వేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో తమిళనాడు మార్కంటైల్ బ్యాంక్ వారి సహకారంతో సుమారు 50 పుష్ కార్టు అందజేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2047 స్వచ్ఛంధ్ర వైపు అడుగులు వేస్తోందని, ఇందుకోసం పీ 4 విధానంలో భాగంగా వివిధ సంస్థలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుం టుందన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ సమర్ధవంతంగా చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని చెప్పారు. నగరాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరు సామజిక బాధ్యతగా ముందుకు వస్తే సమాజంలో పేదరికం ఉండదని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.




## జ్యోతీరావు పూలే ఆశయ సాధనకు బీజేపీ కృషి చేస్తోంది

- ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

విజయవాడ, మహానాడు: జ్యోతీరావు పూలే ఆలోచనలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యరూపం ఇచ్చారు.. బీజేపీ పూలే ఆశయాలు వైపు పరిపాలన సాగిస్తోందని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆమె ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన జ్యోతి రావ్ పూలే జయంతిలో పాల్గొని,




ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జ్యోతి రావు పూలే 1827 జన్మించగా 1891లో కాలం చేశారు.

సమాజంలో అన్యాయం పెరిగినప్పుడు మహానుభావులు జననం జరుగుతుంది. కులాల పట్ల, మహిళల పట్ల అనేక రుగ్మతలు ఉండేవి. జ్యోతి రావ్ పూలే అనేక అవమానాలు భరించి.. సామాజిక స్పృహతో ముందుకు వెళ్ళారని పురందేశ్వరి తెలిపారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే.. నిజమైన సాధికారత మహిళలకు విద్యను అందించినప్పుడే అని పూలే గ్రహించారు. 14 ఏళ్ల వయస్సులో పెళ్లి అయ్యింది. ఆయన సతీమణి సావిత్రి కి విద్యను చెప్పించారు.. జ్యోతి రావ్ పూలే దంపతులు మహిళలకి విద్య కోసం స్కూల్ ఏర్పాటు చేశారు. మహిళల అభివృద్ధి కి బీజేపీ కృషి చేస్తుంది.

కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం అధ్యక్షత వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్ నారాయణ, పార్టీ మీడియా రాష్ట్ర ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 12, ఏప్రిల్ 2025 ‖

# కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం

- విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ: సామాజిక సంస్కరణలకు నాంది పలికిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కొనియాడారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాకానీ నగర్ కార్యాలయంలో తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు మహనీయుడు పూలే కృషిచేశారని తెలిపారు.

# ముస్లింల ప్రాపకం కోసమే కులగణన

- ఇదేనా దేశానికి రోల్ మోడల్ ?
- ఇది బీసీల హక్కులను కాలరాసే కుట్ర.
- రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్

హైదరాబాద్: సంఘ సంస్కర్త, సామాజిక రుగ్మతలపై పోరాట యోధుడు, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడి, బాలికల విద్య, స్త్రీ హక్కులు, వితంతు పునర్వివాహానికి కృషిచేసిన మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ ఏమన్నారంటే.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయి.సామాజిక న్యాయం సూత్రంతో, సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదంతో మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలను ముందుకు తీసుకెళ్తోంది. బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు, పేద అగ్రవర్ణాల వారికి కూడా న్యాయమైన రిజర్వేషన్లు కల్పించింది. అభినవ జ్యోతిబా పూలేగా మోదీజీ కొనియాడబడుతున్నారు.

రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ పేరుతో, ఓబీసీ రిజర్వేషన్ల అంశం పేరుతో కులగణన అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి రాజకీయాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇంటిపోరు, హైకమాండ్ పోరు తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో కులగణన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ బీసీల రిజర్వేషన్లపై మొసలికన్నీరు కారుస్తోంది.

కులగణన అనేది దేశ వ్యాప్తంగా రోల్ మోడల్ గా, దేశానికే రోడ్ మ్యాప్ గా మారుతుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. తీరా కులగణన లెక్కలు చూసిన తర్వాత ముస్లింల ప్రాపకం కోసమే కులగణన చేపట్టినట్లుగా కనపడుతోంది. ఇదేనా దేశానికి రోల్ మోడల్ ? ఇది బీసీల హక్కులను కాలరాసే కుట్ర.

గతంలో బీసీల వాటాను 51 శాతం నుంచి 46 శాతానికి తగ్గించిన కాంగ్రెస్, ఇప్పుడు ముస్లింలను ఓబీసీల్లో చేర్చే ప్రయత్నం చేస్తోంది. 12 శాతం ఉన్న ముస్లిం జనాభాలో 10 శాతం ఓబీసీల్లో చేర్చి ఓబీసీల హక్కులను కాలరాస్తున్నారు. ఇది బీసీల పొట్టగొట్టి హక్కులను కాలరాయడమే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా, 9వ



షెడ్యూల్ వెనుక దాక్కునే ప్రయత్నం చేస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేసేందుకు ఆర్టికల్ 243 (D) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నప్పటికీ 9వ షెడ్యూల్ ను తీసుకొచ్చి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది.

శాసనసభలో చేసిన చట్టాన్ని గవర్నర్ ఆమోదించిన వెంటనే జీవో అమలు చేయొచ్చు. కానీ 9వ షెడ్యూల్‌లో పొందుపరిస్తే గానీ, రిజర్వేషన్ల అమలు చేయరాదనే భావనను ప్రజల్లో కల్పిస్తోంది. భారత సుప్రీంకోర్టు ఇందిరా సహానీ తీర్పు (1992) ప్రకారం, రాష్ట్రాలు 50 శాతం గరిష్ట పరిమితిని పాటించాలని నిబంధన ఉంది.

బీజేపీ అధికారంలోకి రాగానే తెలంగాణలో బీసీ జనాభాకు అనుగుణంగా బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన ఘనత భారతీయ జనతా పార్టీదే. తమిళనాడు రాష్ట్రం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చారని చెబుతున్నారు. కానీ ఇది సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ల హద్దును మించిపోతుంది. ఇది కోర్టులో సవాలు ఎదుర్కొంటోంది.

రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలిసీ కూడా కోర్టు వివాదంలోని అంశాన్ని సాకుగా తీసుకొని "9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే 42% రిజర్వేషన్లు సాధ్యమవుతాయి" అనే వాదనతో ప్రజల్ని మభ్యపెడుతోంది. కేంద్రంపై నెపం నెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు.

ఆర్టికల్ 243(%ణ%) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దీన్ని వెంటనే అమలు చేయాలి.

బీహార్ రాష్ట్రం కూడా తమిళనాడు లాగానే 60% కంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించగా, అదే ఇప్పుడు కోర్టులో విచారణలో ఉంది. ఇది కూడా ఇందిరా సహానీ తీర్పు (1992) ప్రకారం ఏర్పడిన 50% గరిష్ట పరిమితిని ఉల్లంఘించడమే.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణలో ఇదే పేరుతో బీసీలను మభ్యపెట్టి, భ్రమల్లో నెట్టేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలు – బేటీ బచావో బేటీ పడావో, విద్యా సమగ్ర అభివృద్ధి – ఇవన్నీ పూలే ఆశయాలే. కేంద్రంలో మొదటిసారిగా 27 మంది ఓబీసీలకు మంత్రి పదవులు ఇచ్చి, కేంద్ర విద్యా సంస్థల్లో 27 శాతం రిజర్వేషన్లు, కేంద్రీయ విద్యాలయాల్లో, నవోదయ పాఠశాలల్లో, సైనిక్ స్కూళ్లలో, న్యాయ విశ్వవిద్యాలయాలతో పాటు నీట్ మాధ్యమాల్లో జరిగే పరీక్షల్లోనూ 27 శాతం రిజర్వేషన్లను మోదీ ప్రభుత్వం కల్పిస్తోంది.

ఈ కార్యక్రమంలో పార్టీ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు గారు, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ గారు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ , హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతం రావు , తదితర నాయకులు పాల్గొన్నారు.

## రూపాయి ఖర్చు లేకుండా
# పట్టా రిజిస్ట్రేషన్

మొదటి పేజీ తరువాయి..

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 2019లో నేను తీసుకున్న నిర్ణయం నా జీవితాన్ని మార్చేసింది. 2019లో మంగళగిరిలో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. నేనేంటో మీకు తెలియదు. మీ సమస్యలేంటో నాకు అర్థం కాలేదు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. దీంతో కసిగా పనిచేసి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని భావించా. ఆ విధంగానే చేశాను. ఎన్టీఆర్ సంజీవని పేరుతో ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాను. ఇప్పటికీ కొనసాగిస్తున్నాం. మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేయడంతో పాటు ఉపాధి కూడా కల్పిస్తున్నాం. మంగళగిరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటుచేసి క్రీడలను ప్రోత్సహించాం. ఈ విధంగా మంగళగిరిలో 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం.

### 2019లో అనేక రకాలుగా అవమానించారు, మంగళగిరి ప్రజలు నా గౌరవం నిలబెట్టారు

2019 నుంచి 2024 వరకు నన్ను అనేక రకాలుగా అవమానించారు. మంగళగిరిలో గెలవలేదని హేళన చేశారు. సొంత కొడుకుని గెలిపించుకోలేకపోయారని చంద్రబాబుని అన్నారు. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. దానిపక్కన సున్నా పెట్టి 53,000 ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆనాడు మంగళగిరి ప్రజలను కోరాను. అందరికీ దిమ్మతిరిగి విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ రోజు ఇన్ని మంచి కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం చేస్తున్నానంటే దానికి కారణం మీరు ఇచ్చిన మెజార్టీ. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి.

రెండో కేబినెట్ మీటింగ్ లోనే ఇది క్లియర్ అయింది. ఈ నెల 13వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుంది. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందిస్తాం. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. పార్క్ లు, చెరువులు అభివృద్ధి చేస్తాం. పిల్లలు ఆడుకునేందుకు క్రికెట్ టర్ఫ్ లు, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటుచేస్తాం.

### రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తాం

తాడేపల్లిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశాం. ఆరోగ్యంగా ఉండాలంటే అందరం నడవాలి. గంట సేపు వ్యాయామం చేయాలి. నడవాలంటే పార్క్ లు కావాలని ఆనాడు అడిగారు. కొన్ని వార్డుల్లో పార్క్ లు నిర్మిస్తున్నాం. ఇటీవల మంగళగిరిలో ఎస్ఎల్ఎన్ పార్క్ ను ప్రారంభించాం. మరో 6 పార్క్ లు సిద్ధమవుతున్నాయి. 31 కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని ఆనాడు కోరారు. అందులో 17 భవనాలకు భూములను కూడా గుర్తించాం. రెండు భవనాల పనులు కూడా పూర్తికాబోతున్నాయి. వాటిని త్వరలోనే ప్రారంభించబోతున్నాం. మిగతా భవనాలు కూడా యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం. రూ.300 కోట్ల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మించబోతున్నాం. కట్టించి అందజేసే బాధ్యత మేం తీసుకుంటాం.

### గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోలేదు

2019లో ఓడిపోయినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. బాధ కలిగింది. ఇంత మెజార్టీ గెలిపించడంతో నా పరువును కాపాడారు. శాసనసభలో నా గౌరవం పెంచారు. కేబినెట్ లో మంగళగిరి ప్రజలకు ఏదైనా చేయాలంటే చర్చ అవసరం లేకుండానే మంజూరు చేస్తున్నారు. మా పైన బాధ్యత పెరిగింది. దశాబ్దాల కల అయిన శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని కోరారు. మూడు, నాలుగు దశల్లో ఇంటి పట్టాలు అందిస్తామని ఆనాడు చెప్పా. ఏడాదిలోగా బట్టలు పెట్టి మొదటి దశ ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పా. 11 నెలల్లో హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. పద్ధతి ప్రకారం హామీలు నిలబెట్టుకుంటున్నాం.

కొలతలు తీసేందుకు అధికారులతో కలిసి కూటమి నేతలు వచ్చారు. మీ వద్ద కప్పు కాఫీ కూడా తీసుకోలేదు. అవినీతిరహితంగా చేస్తున్నాం. గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగారు. జిరాక్స్ లకు, అర్జీలకే వేలరూపాయలు ఖర్చు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన కొలతలు తీశాం. ఆ వివరాలన్నీ వచ్చిన వెంటనే కేబినెట్ లో చర్చించి పాలసీ తీసుకువచ్చాం. ఈ నిర్ణయం వల్ల మంగళగిరి ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి లబ్ధి చేకూరుతుంది.

### రూపాయి ఖర్చు లేకుండా పట్టా రిజిస్ట్రేషన్

వచ్చే వారం నుంచి ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రెండేళ్లలో పట్టాను అమ్ముకునే హక్కు కూడా మీకు వస్తుంది. దయచేసి ఎవరూ అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మన ప్రాంతం అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది. మంగళగిరిని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతున్నాం. అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. స్వచ్ఛతలో మీ సహకారం కావాలి. మీరు నన్ను పెద్దఎత్తున గౌరవించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారు. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. మీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని చెప్పారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

- ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దాం
- సమసమాజ స్థాపనకు చేయూతనిద్దాం
- జ్యోతిరావు పూలే జయంతి వేడుకలో కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం

రామచంద్రపురం: ప్రముఖ సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, ఇన్చార్జ్ పొలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులుతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం పాల్గొని మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజి




మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా కీర్తింపబడుతున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు.


మహాత్మ పూలే జయంతి సందర్భంగా రామ చంద్ర పురం నియోజవర్గంలో జరిగిన పలు జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కార్యాలయం లోనూ, ద్రాక్షరామం కూడలిలోనూ, మున్సిపల్ కార్యాలయంలోనూ వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ

కంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాల పీడిత ప్రజల కోసం ఎనలేని సేవలు, త్యాగాలు చేశారని గుర్తు చేశారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం, స్త్రీ జాతి అభ్యున్నతి, విద్య కోసం అలుపెరగని కృషి చేశారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదం శెట్టి శ్రీదేవి, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలరావు, ఎజిపి కమల కుమారి, రామ చంద్రపురం నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు,న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వేధింపుల కేసులో అడ్డంగా బుక్కైన జైలర్ సుబ్బారెడ్డి

అనంతపురం: అనంతపురం జైలర్ సుబ్బారెడ్డి తనకు న్యూడ్ కాల్స్ చేసి వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఒక వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు విశాఖపట్టణం సైబర్ క్రైమ్ పోలీసులు గత నెల 22వ తేదీనే కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా



ఉన్నాయి. విశాఖ పట్టణానికి చెందిన ఒక మహిళను అనంత పురం జైలర్ సుబ్బారెడ్డి, వేధిస్తున్నట్లుగా విశాఖ సైబర్ క్రైమ్ సెల్ పోలీసులకు గత నెలలోనే ఫిర్యాదు అందింది. ఈ దర్యాప్తులో భాగంగా బాధితురాలు ఇచ్చిన ఆధారాలను పరిశీలించిన విశాఖ పోలీసులు ఆ వేధింపులు నిజమేనని నిర్ధారించుకున్నారు.

విశాఖలో విచాణకు హాజరు కావాల్సిందిగా ఇప్పటికే మూన్నాలుగు సార్లు విశాఖ పోలీసులు అనంత పురం జైలర్ సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే, ఆ నోటీసులకు జైలర్ సుబ్బా రెడ్డి స్పందించకపోవడంతో ఆయన్ను వెతుక్కుంటూ విశాఖ నుండి ఒక పోలీసుల బృందం అనంతపురం చేరుకుంది.

కానీ అప్పటికే జైలర్ సుబ్బారెడ్డి తప్పించుకుని పారిపోయారు. అప్పటి నుండి ఆయన ఆచూకీ లేకపోవడంతో విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బగ్చీ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు ఒక లేఖ రాశారు. మహిళపై వేధింపుల కేసు విచారణలో అనంతపురం జైలర్ తమకు సహకరించడం లేదని సీపీ బగ్చీ తన లేఖలో పేర్కొన్నారు.

పోలీసు శాఖలోనే విధులు నిర్వర్తిస్తున్న సుబ్బారెడ్డి వ్యవహారం గురించి, ఆయన తప్పించుకు తిరుగుతున్న తీరు గురించి ఆ లేఖ ద్వారా డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా అందుతోన్న సమాచారం ఏంటంటే, యాంటిసిపేటరీ బెయిల్ తీసుకున్న సుబ్బారెడ్డి ఏప్రిల్ 9న విశాఖ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

అయితే, యాంటిసిపేటరీ బెయిల్‌తో తమ ముందుకు వచ్చిన సుబ్బారెడ్డికి 41A Crpc కింద నోటీసులు ఇవ్వడం జరిగిందని వైజాగ్ సీపీ శంఖబ్రత బగ్చీ తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగు తోందని బగ్చీ మీడియాకు చెప్పారు.

# ఈనెల 15వ తేదీలోపు ఇంటర్, 22న పదో తరగతి పరీక్షల ఫలితాలు

అమరావతి: ఇంటర్ ఫలితాలపై బోర్డు మరో అప్‌డేట్ ఇచ్చింది. 10 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాయగా, మార్చి 17 నుంచి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం అయింది. తాజాగా మూల్యాంకన ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కంప్యూటరీకరణ ప్రక్రియను చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 15వ తేదీలోపు ఫలితాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈసారి మన మిత్ర వాట్సాప్ ద్వారా ఫలితాలను అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఏప్రిల్ 22 న పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది.



# సామాజిక న్యాయానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడు పూలే

- సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వద్ద మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్: ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి, ఆ వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కొనియాడారు. శుక్రవారం యూసఫ్ గూడ సమీపంలోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు.

దేశంలోని అనేకమంది వెనుకబడిన వర్గాలు ప్రధానంగా మహిళలకు సామాజిక న్యాయం జరగాలని జ్యోతిరావు పూలే పెద్ద ఎత్తున పోరాటం చేసి ఈ దేశంలో ఆ వర్గాలకు దశా దిశా నిర్దేశం చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు. పూలే జయంతి సందర్భంగా అందరం స్మరించుకుంటూ వారు చూపిన మార్గంలో ప్రయాణిస్తూ వారి ఆశయాలు నెరవేర్చడం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రజా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలియజేశారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల కోసం పనిచేయాలన్న ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు పూలే జయంతి సందర్భంగా మరోసారి ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, CDS నిర్వాహకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సీనియర్ జర్నలిస్టు రామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై ప్రేమ ఉంటే బీసీ సీఎంను చేయండి

- కాంగ్రెస్ డీఎన్ఏలో బీసీ వ్యతిరేకత
- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బీసీల కొంగజపం
- భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కాలం నుంచి రాహుల్ గాంధీ వరకు వారి డీఎన్ఏలో బీసీ వ్యతిరేక పార్టీగానే మిగిలింది. బీసీ వ్యతిరేకత వల్ల కాంగ్రెస్ పార్టీ



దేశం మొత్తంలో తుడుచుకుపెట్టుకుపోయింది. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బీసీల పట్ల కొంగజపం చేస్తున్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీలపై చేస్తున్న ద్వంద్వ విధానాలను ప్రశ్నిస్తున్నాం. మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే పేరిట ప్రమాణం చేసి, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ , ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైంది. రాష్ట్రంలోని బీసీ జనాభా 52 శాతం ఉండగా, దాన్ని కేవలం 46 శాతంగా చూపించి చట్టబద్ధంగా తక్కువ చూపేందుకు కుట్ర చేశారని అనుమానం కలుగుతుంది.

బీసీ గణన వివరాలను ఇప్పటివరకు అధికారికంగా ఎందుకు విడుదల చేయలేదు? కాంగ్రెస్ పార్టీకి నిజమైన నిబద్ధత ఉంటే, గ్రామాల వారీగా కులగణన వివరాలను అధికారికంగా ప్రకటించాలి. తొలి అసెంబ్లీ సమావేశంలో బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ దానికి కార్యరూపం ఇవ్వలేదు.

ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. బీసీ వ్యక్తిని ప్రధానమంత్రి చేసిన ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కుతుంది. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఒక్కసారి కూడా బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించలేదు. కనీసం ఉప ముఖ్యమంత్రిగా కూడా నియమించలేదు. బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేసి, ఆ తర్వాతే బీసీ సంక్షేమంపై మాట్లాడాలని రాహుల్ గాంధీని ప్రశ్నిస్తున్నాం. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

# ఇ.ఎస్.ఐ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు

- కార్మిక శాఖ అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

విజయవాడ: ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు స్పష్టం చేసారు. శుక్రవారం ఉదయం విజయవాడ ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌ను సందర్శించిన చంద్రుడు, ఓపీ రిజిస్ట్రేషన్, లాబరేటరీ, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ విభాగాలను పరిశీలించారు.





రోగుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వైద్య సేవలు మరింత ప్రభావవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ధన్వంతరి ఆన్లైన్ రిజిస్ట్రేషన్, ఆధార్ అనుసంధానం వంటి అంశాలను సమీక్షించిన చంద్రుడు, రిజిస్ట్రేషన్ వ్యవస్థను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. చందాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.

హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసిన చంద్రుడు, ఇ.ఎస్.ఐ డైరెక్టర్ వి. ఆంజనేయులుకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వి. జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025

# అంబేద్కర్‌కి భారతరత్న ఇవ్వని కాంగ్రెస్

- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొప్పు బాష



**హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పూనుకుంది. తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 13వ తేదీ నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు అంబేద్కర్ కు సంబంధించిన విషయాలను, బిజెపి ఆ మహనీయుడిని స్మరించుకునేలా చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టింది.

దేశాన్ని 55 సంవత్సరాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ దళితులను అడుగడుగునా అవమానించింది. ప్రధానమంత్రి కావాలనే కలలు కంటున్న రాహుల్ గాంధీ, బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తారని దేశవ్యాప్తంగా దుష్ప్రచారం చేశారు. దేశంలో బాబా సాహెబ్ అంబేద్కర్ ని అత్యధికంగా మోసం చేసినది కాంగ్రెస్ పార్టీ.

అంబేద్కర్ కి కనీసం భారతరత్న ఇవ్వకుండా నిరాకరించింది కాంగ్రెస్ పార్టీ. పార్లమెంటుకు రాకుండా అంబేద్కర్ గారిని ఓడించిన చరిత్ర కూడా కాంగ్రెస్ పార్టీదే. "దొంగే దొంగ" అన్నట్లు, అంబేద్కర్ ని అవమానించిన కాంగ్రెస్ పార్టీనే బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందంటూ తప్పుడు ప్రచారం చేసింది.

నలుగురు ఎస్సీలను గవర్నర్లుగా నియమించిన ఘనత కూడా బీజేపీదే. పార్లమెంట్‌లో అంబేద్కర్ గారి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి గౌరవించిన పార్టీ బీజేపీ. నరేంద్ర మోదీ ప్రధానిగా అయిన తర్వాత బాబా సాహెబ్ అంబేద్కర్ కి సంబంధించి ప్రదేశాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేశారు.

దేశంలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ ఎంపీలున్న పార్టీ బీజేపీ మాత్రమే. గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీదే. నరేంద్ర మోదీ మొట్ట మొదటిసారిగా ప్రధానిగా ఎన్నికైనప్పుడు, "ఇది అంబేద్కర్ గారు ఇచ్చిన భిక్ష" అంటూ పార్లమెంటులో ప్రవేశించిన గొప్ప నాయకుడు. గాంధీ కుటుంబ సభ్యులకు భారతరత్న లభించినా, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ కి భారతరత్న ఇవ్వనిది కాంగ్రెస్ పార్టీ.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు రూ. 10 లక్షలు, మూడెకరాల భూమి వంటి హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసింది. దళితులకు రూ. 13 లక్షలు ఇస్తామని, ఇండ్లు కట్టిస్తామని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాటిని అమలు చేయకపోవడం దురదృష్టకరం.

# ఒక గోవు మాత్రమే అనారోగ్యంతో మృతి చెందింది

- మిగతా గోవులు గోశాలలో ఉన్నాయి
- టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చేందుకు కుట్రలు
- 100 గోవులు చనిపోయాయంటూ అబద్ధాలు ప్రచారం
- కరుణాకర్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగిన బుచ్చి రాంప్రసాద్

**మంగళగిరి, మహానాడు:** తిరుపతిలో తొక్కిసలాట జరిగి భక్తుల ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన హరిప్రసాద్ రెడ్డిని ఎలాగైనా కాపాడాలని కరుణాకర్ రెడ్డి కుట్రలకు తెరలేపారని, టీటీడీని దిగజార్చేలా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నక్సలైట్ ఉద్యమంలో ఉన్నప్పుడు వెంకటేశ్వర స్వామి ఒక నల్లరాయి అని.. రాయితో కొడితే మాత్రం వెంకటేశ్వరస్వామి ఏమి చేయగలడని మాట్లాడిన నీచ చరిత్ర కరుణాకర్ రెడ్డిది. చైర్మన్ పదవిని అడ్డుపెట్టుకొని టీటీడీ నిధులను డైవర్ట్ చేసి దోచుకోవడమే కాక.. పవిత్రమైన టీటీడీ లడ్డును మున్సిపల్ ఎన్నికల్లో ఇంటింటికి పంచి రాజకీయ ప్రయోజనానికి వాడుకున్నారని రాంప్రసాద్ ఆరోపించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. డాలర్లు, బంగారు నగలు, డిపాజిట్ల అవినీతిపాటు ఇష్టానుసారంగా టీటీడీని దోచుకుని నేడు సిగ్గులేకుండా అసత్యాలు మాట్లాడుతున్నారు. పెదవులపై ఒక మతం, మనసులో మరో మతం పెట్టుకొని టీటీడీ చైర్మన్ గా చేసి టీటీడీ పవిత్రను మంటగలిపిన వ్యక్తులు టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోకూడదు. కఠిన చర్యలు తీసుకోవాలి.

గోవును మనం లక్ష్మీ స్వరూపంగా భావిస్తాం. అలాంటి గోవును కూడా వైసీపీ నీచ నేతలు రాజకీయాలకు వాడుతున్నారు. టీడీపీ పాలనలో టీటీడీ ప్రతిష్ఠ పెరుగుతుంటే ఓర్వలేకపోతున్నారు. వైసీపీ పాలనలో టీటీడీలో జరిగినన్ని అక్రమాలు ఈ దేశ చరిత్రలో ఏనాడు జరగలేదు. సిట్ దర్యాప్తులో వైసీపీ నేతలు అక్రమాలు బయటకు వచ్చాయి. దీంతో వైసీపీ ప్రతిష్ఠ పూర్తిగా దిగజారింది.. అందుకే నేడు గోవుల పేరుతో టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారు.

కొత్త డ్రామాలకు తెరలేపారు. కరుణాకర్ రెడ్డి 100 గోవులు చనిపోయాయని అసత్యాన్ని ప్రచారం చేస్తున్నారు. పొనమనూరు నుండి



వచ్చిన ఒక్క ఆవు మాత్రమే అనారోగ్యంతో మృతి చెందింది. దాదాపు 2,668 గోవులు గోశాలలో ఉన్నాయి. వాటిని జియో ట్యాగ్ ద్వారా ప్రతి రోజు టీటీడీ వారు పర్యవేక్షిస్తున్నారు. గోశాలను శుభ్రం చేయడం.. వాటికి మెరుగైన ఆహారం ఇవ్వడంతో పాటు.. అన్ని సక్రమంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రతిష్ఠను, టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చేందుకే కరుణాకర్ రెడ్డి దుష్ప్రచారాలు చేయడం మొదలెట్టారు.

నాడు కలియుగ వైకుంఠ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న నిలయంలో అన్యమత ప్రచారానికి పూనుకున్నారు. రూముల రేట్లు పెంచి భక్తులను దోచుకున్నారు.. హిందూ మతంపై దాడి చేశారు. మళ్ళీ సిగ్గులేకుండా నేడు అసత్యాలను వల్లించి భక్తులను మోసం చేయాలని చూస్తున్నారు.

# ఏపీలో 'స్థానిక' ఎన్నికలు

- ఈసీ నీలం సాహ్ని



**అమరావతి, మహానాడు:** ఏపీలో త్వరలో ఎన్నికల మోత మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని అధికారులకు సూచనలు చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని నీలం సాహ్ని ఆదేశించారు. రానున్న సంవత్సరంలో ఏపీలో జరిగే ఎన్నిలకు సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రణాళికా బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, పోలీస్ బలగాలు, ఎలక్ట్రోరల్ రోల్ అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# జ్యోతిరావు పూలే జీవితం స్ఫూర్తిదాయకం









- మంత్రి లోకేష్

**అమరావతి, మహానాడు:** బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే. సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం. పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



### టీడీపీ సెంట్రల్ ఆఫీసులో...

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, పార్టీ నాయకులు దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబు, జంగా కృష్ణమూర్తి, వీరంకి గురుమూర్తి, దూండి రాకేష్, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, పాతర్ల రమేష్, గొట్టిముక్కల రఘురాం రాజు, చప్పిడి రాజశేఖర్, ఆళ్ల గోపాలకృష్ణ, ఏ వి రమణ, దేవతోటి నాగరాజు, పారా రామకృష్ణ పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పూలమాలవేసి, ఘన నివాళుర్పించారు.

### విద్యా హక్కు కోసం పోరాటం

మహాత్మా జ్యోతిరావు పూలే భారత సమాజంలో సామాజిక సమానత్వం,విద్యా హక్కు కోసం చేసిన పోరాటం చిరస్మరణీయుడని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

### నరసరావుపేటలో...

మహాత్మా జ్యోతిరావు పూలే గారి జయంతి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్నాడు రోడ్ లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పల్నాడు కలెక్టర్ ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్న అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ చేతి వృత్తుల వారికి సబ్సిడీ రుణాల చెక్కులను అందించారు.

### మహాత్మా జ్యోతిబా పూలే సేవలు మరువలేనివి: సీఎస్ విజయానంద్

మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించిన కుల వ్యతిరేక కార్యకర్త, రచయిత, ఆలోచనా పరుడు, సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే అని పేర్కొన్నారు.

### రాష్ట్ర సచివాలయంలో...

మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. సీఎం కార్యదర్శి ఏవీ రాజమౌళి, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, ఐటి శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి



పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

### గుంటూరులో...

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ట్రావెలర్స్ బంగ్లా దగ్గరలోని ఆయన విగ్రహానికి నగరపాలక సంస్థ ఇంచార్జి మేయర్ షేక్ సజిలా, కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవి అధికారులు పూలమాలలు వేసి, ఘన నివాళుర్పించారు.

# అప్పుల అప్పారావు...మునిగేనా ? తేలేనా?

అనగనగా భూమండలం అనే ఒక ఊరు.

ఆ ఊళ్ళో పెద్ద డాబుసరి ...

... అప్పారావు గారు .

"ఆయనకేంట్రా కోటీశ్వరుడు" అని అందరూ అనుకొంటారు .

ఆయన అడిగిందే తడవుగా అందరూ అప్పులిస్తారు .

అప్పులతో బతికెయ్యడం అప్పారావు గారి కుటుంబానికి అలవాటయ్యింది .ఆదాయం 2 . వ్యయం 12 .రాజ్యపూజ్యం 100 . అవమానం 4 .

అప్పారావు గారి ఇంట్లో ఒకరిద్దరు అసమాన్య ప్రతిభావంతులు. బాగా సంపాదిస్తున్నారు .

కానీ మిగతా వారు శుంఠలు. . చదివింది పెద్దగా లేదు .

అప్పారావు తెచ్చిన అప్పులపై బతికేస్తున్నారు.

పాత అప్పు తీర్చడానికి కొత్త అప్పు .

ఊళ్ళో కిరాణా కొట్టు వాడి దగ్గర , బట్టల షాప్ వాడి దగ్గర , చెప్పుల దుకాణం లో, హెూటల్ వాడి దగ్గర అప్పు .

" అప్పా రావు గారు తీర్చకుంటే ఇంకెవరు తీరుస్తారు?" అని అడిగిందే సరుకులు ఇచ్చేస్తున్నారు .

అప్పారావు ఎప్పుడో దివాళా తీసాడు. ఆ విషయం అందరికీ తెలుసు. కానీ వారు చెయ్యగలిగింది ఏమీ లేదు. అప్పారావు గారు కొనడం మానేస్తే ఆ ఊళ్ళో సగం దుకాణాలు మూసేయాల్సిందే .

అప్పారావు కు అప్పులివ్వడంలోనే వారి బిజినెస్ ఆధార పడింది .

అప్పారావు దివాళా తీస్తే తాము మునిగి పోతారు .

ఓడ లోకి నీరు వచ్చింది

. కాసేపటి దాక ఓకే .

కానీ అలాగే చూస్తూవుంటే మునిగిపోవడం ఖాయం కదా !

అప్పారావు గారి సంగతి పక్కన పెట్టి అమెరికా విషయానికి వద్దాము .

ఒక దేశం ఇతర దేశాలకు సరుకులు సేవలు అమ్మింది.

డబ్బు సంపాదించింది.

ఇది ఆదాయం .

ఆదాయం బట్టి ఖర్చులు .

అంతే కదా?

వ్యక్తులకైనా... దేశాలకైనా అదే రూల్.

ఆదాయానికన్నా ఖర్చులు ఎక్కువైతే ?

దాన్నే కరెంట్ అకౌంట్ డెఫిషిట్ అంటారు

ట్రేడ్ డెఫిషిట్ కూడా ఇలాంటిదే .

ట రెంటికి మధ్య తేడా చెప్పాలంటే గంట క్లాస్ తీసుకోవాలి . గ్రూప్స్ కు... యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫసర్ ను ఏర్పాటు చేస్తే " సార్ .. ఆయనకు మస్తు సబ్జెక్టు వచ్చు . కానీ ఆయన చెప్పింది మాకు అర్థం కాదు. మీరు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు చెబుతారు . మీరే చెప్పండి" అని పట్టుపట్టి చెప్పించుకొన్న గ్రూప్స్ అభ్యర్థులు కాదు మీరు . కాబట్టి ప్రస్తుతానికి కరెంట్ అకౌంట్ డెఫిషిట్... ట్రేడ్ డెఫిసిట్ రెండూ ఒకటే అనుకోండి .ఊ



గత సంవత్సరం అమెరికా ట్రేడ్ డెఫిషిట్ 75 వేల కోట్లు.

అంటే ఏంటి ?

అమ్మింది తక్కువ ..

కొనింది ఎక్కువ .

గత ఇరవై ఏళ్లుగా ఇదే తంతు .

అప్పుల అప్పారావు తరహాలో లాక్కుని వస్తున్నారు .

ఇలా ఆదాయం కన్నా వ్యయం ఎక్కువైతే ఏమి జరుగుతుంది ?

అప్పు .. ముప్పు స్థాయికి తయారవుతుంది .

అమెరికా విదేశాలకు బాకీ పడిన మొత్తం... కోటి ఇరవై కోట్ల కోట్లు . అర్థం కాలేదా ?

కష్టమండీ . ఇంత పెద్ద ఫిగర్ అర్థం కావడం .

ఒక కోటి .. వెయ్యి కోట్లు .. లక్ష కోట్లు .. కోటి కోట్లు .. అమెరికా వాడి అప్పు కోటి కోట్లు దాటి ముందుకు దూసుకొని పోతోంది .

ఇండియా బీద దేశం అని కదా మనం అనుకొంటాము .

అమెరికా వాడి విదేశీ అప్పు మనకంటే యాభై రెట్లు ఎక్కువ .

అమెరికా అంటే మనోళ్లు ఊహించుకొనే సీన్ వేరు .

" అబ్బో .. అక్కడ అందరూ మేధావులు . పెద్ద పెద్ద చదువులు చదివి ఉంటారు" అనుకొంటారు .

అమెరికా లో ముగ్గురిలో ఒకరు హై స్కూల్ దాట లేదు .

అంటే టెన్త్ ఫెయిల్ అన్నమాట ట అక్కడ ప్లస్ టు ఊ .

పదహైదు శాతం మంది కాలేజీ లో చేరి డిగ్రీ ఫెయిల్ అయిన సరుకు.

అంటే సగం జనాభా వేలి ముద్ర టైపు అన్నమాట ట మరీ వేలి ముద్ర కాదు కానీ .. దాదాపు అలాంటిదే ఊ .

23 శాతం మంది డిగ్రీ ..

కేవలం 14 శాతం మంది ఉన్నత విద్య .

అదీ వారి సరుకు!

చదువుది ఏముంది?

పని చేస్తారా ? అంటారా ?

అక్కడికే వస్తున్నా !

అక్కడ తినడం ఒక రోగం .

ఉద్యోగం సద్యోగం లేకపోయినా ప్రభుత్వాలు అప్పు తెచ్చి మరీ ఏదో ఒక స్కీం కింద పౌరులకు డబ్బులు పంచుతుంటాయి . దీనితో తినడమే ఉద్యోగం గా పెట్టుకొన్న వారు ఎందరో .

అమెరికా లో సగం జనాభా అధిక బరువు ... స్థూల ఖాయం సమస్య తో బాధ పడుతున్నారు.

జనాభా లో పది శాతం మంది అతి స్థూల ఖాయ రోగం తో బాధ పడుతున్నారు. .

వీరు బెడ్ పై నుంచి లేవడం కష్టం. నడవలేరు .

బయటకు వెళ్లాలంటే బ్యాటరీ సాయం తో నడిచే చక్రాల కుర్చీ కావాలి .

ఎప్పుడో 2012 లోనే లాస్ ఏంజెల్స్ యూనివర్సల్ స్టూడియో లో... ముప్పై ఏళ్ళు లోపు గున్న ఏనుగులు చక్రాల కుర్చీ లో కూర్చొని ఒడిలో రెండు లీటర్ ల కోక్ బాటిల్... మూడు కిలో పొటాటో చిప్స్ బకెట్ పెట్టుకొని చిద్విలాసంగా తింటూ తిరగలాడుతుంటే .. ఈ సృష్టి ఇక్కడితో ఆగిపోతే బాగుణ్ణు అనిపించింది.

మోయలేని బరువు ఉన్న వాళ్లకు స్పెషల్ అలవెన్సు లిచ్చి మరింత తిండి తినిపించే దేశం అది .

ఇలాంటి వాళ్ళు పనికి పోరు.పోలేరు .

ట్రంప్ నిజంగా పిచ్చోడే.

ఇన్నాళ్లు వరుసపెట్టి అమెరికా ప్రభుత్వాలు అప్పు పులి పై స్వారీ చేస్తున్నాయి. .

పులి నుంచి దిగాలి అని ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. .

అందుకే విదేశీ వస్తువుల పై భారీ సుంకాలు .

అప్పుడు విదేశీ వస్తువులు కొనడం తగ్గిపోతుంది .

స్వదేశీ వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది .. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి .. విదేశీ అప్పు తగ్గుతుంది...అని ట్రంప్ ఆలోచన .

కానీ ట్రంప్ మహా స్పీడ్ గా వెళుతున్నాడు .

విదేశీ టారిఫ్ లు పెంచడానికి కొంత గడువు ఇచ్చాడు అనేది లేటెస్ట్ వార్త

అమెరికా లో అత్యంత ప్రతిభావంతులు ఉన్న మాట వాస్తవం.

అదే సమయం లో పనీ పాట లేకుండా తిని కూర్చొనే వారు ఎక్కువ .

ఇప్పుడు వారంతా పనికి వస్తారా ?

ఎప్పుడో పట్టాలు తప్పిన అమెరికా ఆర్థిక వ్యవస్థ గట్టెక్కేనా ?

బలవంతుడు నాకేమని పలువురితో టారిఫ్ ఛాలెంజ్ లు విసురుకొంటూ పోతే .. బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి ఏమవుతుందో ?

ఫినాయిల్ వేసి కడిగినా ఆ నోరు శుద్ధం కాదు. రోత భాష.

ట్రంపారి విధానాలు .

అప్పుల అప్పారావు తేలేనా?

చైనా అంటే మనకు పడదు .

కానీ శత్రువు బలం గుర్తించాలి కదా ?

చైనాపై ట్రంప్ టారిఫ్ యుద్ధం ప్రకటించాడు . ఇది రెండు దేశాలకు నష్టం అని ఎవరైనా చెప్పవచ్చు . ఇది ఒక కోణం లో నిజం .

కానీ అమెరికా కు చైనా కావాలి . చైనా కు అమెరికా అక్కర లేదు .

చైనా షావుకారు. ఈ షావుకారు ఇంట్లో కష్టపడి పనిచేసే వారే అందరూ .

కసి తో పని చేస్తారు. విజన్ తో దూసుకొని పోతున్నారు. చైనా ట్రేడ్ సర్ ప్లస్ ఉన్న దేశం.అమెరికా అప్పుల అప్పారావు. .

అప్పుల అప్పారావు ఆ ఊళ్లోని పెద్ద మాల్ ఓనర్ దగ్గరకు వెళ్లి" నేను నీ సరుకు కొనను" అని సవాలు చేస్తే ఎలా ఉంటుంది ?

నూట యాభై ఏళ్ళ క్రితం "చైనా పుచ్చకాయను మొత్తం కట్ చేయలేము .. పక్కలో నుంచి ముక్క ముక్కలుగా కోసుకొనితిందాము" అని యురోపియన్ లు అనుకొన్నారు . ఆ పని చేశారు కూడా .

ఇప్పుడు చైనా డ్రాగన్ . కొయ్యాలంటే కోసేస్తుంది .

ట మీకు స్థూలంగా అర్థం కావడానికి కొన్ని విషయాలు బాగా సింప్లి ఫ్య్ చేసి చెప్పాను. నేను చెప్పిన విషయాల్లో కొన్ని మినహాయింపులు ఉన్నాయి అని గమనించగలరు ఊ

**- నాగమంజరి**

జనం గుండె చప్పుడు
మహానాడు
06
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025

## లాగి తంతేనే 11 సీట్లకు
# పరిమితం అయ్యారు!

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మహానాడు:** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసీపీని లాగి తంతే జగన్ మోహన్ రెడ్డి 11 సీట్లకు పరిమితం అయ్యి, నేడు తన స్థాయిని దిగజార్చుకొని, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, గోరంట్ల మాధవ్, కోడాలి నాని, రోజా లాగా మారిపోయారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణ లో విలేకరులతో మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డికి అధికారం లేకపోయేసరికి మతిభ్రమించినదని,. గురువారం వైసీపీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ రెడ్డి " ఈ పక్కన తంతే, ఆ పక్కన పడతారు" "ఈ సారి వార్ వన్ సైడ్" అంటూ పగటి కలలు కంటున్నారని వైసీపీ మరో 3 ఎన్నికల్లో పోటీ చేసినా గెలవదని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.





## 'పల్లెనిద్ర'లో ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మహానాడు:** మండలం పాలపాడులో గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, వారి సతీమణి సుధా రాజేశ్వరి, రాష్ట్ర గ్రంథాలయల సంస్థల చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు టీడీపీ కూటమి పార్టీ నాయకులు గ్రామంలో ఇంటింటికి కలియతిరుగుతూ గ్రామస్తుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల నుండి వినతి పత్రాలను అందుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి కప్పు పట్టలను వంట సామగ్రిని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు ఎప్పటికప్పుడు మీ సమస్యలు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి, ఐకమత్యంగా ఉంటే త్వరగా అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు గ్రామస్తులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## సీతారాములకు శ్రీవారి కానుక

- సీతమ్మకు స్వర్ణ కిరీటం, రామయ్యకు యజ్ఞోపవీతం బహూకరణ

**ఒంటిమిట్ట, మహానాడు:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య కల్యాణం పురస్కరించుకుని తిరుమల నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామివారు శుక్రవారం కానుకలు పంపారు. కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ శుభ సందర్భంగా స్వర్ణ కిరీటం, యజ్ఞోపవీతం ఆభరణాలను కానుకగా అందించారు.
టీటీడీ అనుబంధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి కానుకలు పంపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం ఈ ఆభరణాలు సమర్పించారు. ఆలయం ముందు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు ఆభరణాలకు పూజలు చేసి కోదండరామునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో శ్రీవీరబ్రహ్మం ,ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ నటేశ్ బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గోవులపై వైసీపీ దుష్ప్రచారం!

- మంత్రి నారా లోకేష్ విమర్శ

**అమరావతి, మహానాడు:** గోవుల మరణాలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని మంత్రి నారా లోకేష్ ఖండించారు. టీటీడీ గోశాలలో గోవుల మరణాలంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, దురుద్దేశపూరిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా, వాస్తవాలను టీటీడీ స్పష్టం చేసిందని మంత్రి తెలిపారు. సమాజాన్ని తప్పు దోవ పట్టించేందుకు, రెచ్చగొట్టేందుకు వైసీపీ పురిగొల్పుతున్న తప్పుడు కథనాలను భక్తులు నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ లబ్ధి కోసం పవిత్ర సంస్థలపై అసత్యాలను ప్రచారం చేయడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు.



## గోరంట్ల మాధవ్, అనుచరుల అరెస్ట్

- కిరణ్ అరెస్టు సమయంలో పోలీస్ వాహనాన్ని అడ్డుకుని, నిందితుడిపై దాడికి పాల్పడ్డ ఫలితం

**గుంటూరు, మహానాడు:** ఒక యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే నిందితుడిని అరెస్టు చేశామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. నిందితుడిని మంగళగిరి నుండి గుంటూరుకు తరలిస్తుండగా తన అనుచరులతో పోలీస్ వాహనాన్ని అనుసరించి మార్గమధ్యలో అడ్డగించి పోలీస్ వారిని నెట్టివేస్తూ, వారి విధులకు ఆటంకం కలిగిస్తూ పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిపై గోరంట్ల మాధవ్ తన అనుచరులతో దాడికి పాల్పడ్డాడని ఎస్పీ



తెలిపారు. దీంతో నిందితులను అరెస్టు చేశామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

గోరంట్ల మాధవ్ మాజీ ప్రజాప్రతినిధి అయివుండీ ఈ విధంగా ప్రవర్తించడం... ఇరుపార్టీల శ్రేణుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, అలజడులు సృష్టించడం తద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడమే ఎస్పీ అన్నారు. పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిపై దాడికి పాల్పడటం, పోలీస్ విధులకు ఆటంకం కలిగించడాన్ని తీవ్రంగా పరిగణించి భవిష్యత్తులో ఎవరూ కూడా ఇటువంటి నేరపూరిత చర్యలకు పాల్పడకుండా ఉండాలని గోరంట్ల మాధవ్, అతని అనుచరులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు.



బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త, స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ప్రజాభవన్‌లో ఘన నివాళి తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు







## నాకు రావల్సిన ఉద్యోగాన్ని సాక్షి విలేఖరి
# తన భార్యకు ఇప్పించుకున్నాడు

- టీడీపీ గ్రీవెన్స్‌లో పిడుగురాళ్లకు చెందిన బాధితురాలు ఫిర్యాదు
- వైసీపీ నేతల అరాచకాలపై గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు
- అర్జీలు ఇచ్చి తమకు న్యాయం చేయాలంటూ విన్నపం
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి

**మంగళగిరి, మహానాడు:** పల్నాడు జిల్లా, పిడుగురాళ్లకు చెందిన ఓ బాధితురాలు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ... తాను మాతా శిశుసంక్షేమ శాఖలో అంగన్ వాడీ హెల్పర్‌గా విధులు నిర్వహి స్తున్నానని.. తాను పనిచేస్తున్న స్కూల్ లో అంగన్ వాడీ టీచర్ కు ప్రమోషన్ రావడంతో ఆమె బదిలీపై వెళ్లిపోయిందని.. ఆ టీచర్ ఉద్యోగానికి తనకు అన్ని అర్హతలు ఉన్నా గత వైసీపీ ప్రభుత్వంలో సాక్షి విలేఖరి, వైసీపీ నేతలు కలిసి.. బీసీలు, మైనార్టీలకు దక్కే జాబును ఓసీకి మార్చి తనకు ఉద్యోగం రాకుండా చేశారని.. సాక్షి విలేఖరి తన భార్యకు ఆ ఉద్యోగాన్ని ఇప్పించుకున్నాడని.. దీనిపై పోరాడుతున్న తనను స్టేషన్ లో పెట్టి కొట్టించి కేసులు పెట్టారని.. తనకు న్యాయం చేయాలని నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ లకు అర్జీ ఇచ్చి వేడుకున్నారు.

- బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరపాలెం గ్రామానికి చెందిన కోడెల నాగమల్లేశ్వరి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కూతురు పేరుమీద ఉన్న భూమిపై కోర్టులో ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నా.. అక్రమంగా తమ చేలోకి ప్రవేశించి తమపై మేకల వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, అతని భార్యలు కర్రలతో దాడి చేశారని.. దీనిపై పోలీసుకు ఫిర్యాదు చేస్తే అసలు పట్టించుకోలేదని.. దీంతో వారు చేలో వేసిన మినప పంటను పూర్తిగా నాశనం చేశారని.. దీని వల్ల తమకు 30 వేలు నష్టం వాటిల్లిందని.. దయ చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
- ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన పిన్నెబోయిన రవణమ్మ



గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో 3.52 సెంట్ల భూమి ఉందని.. ఆ భూమి తన పెద్ద కుమారుడి పేరున ఉన్నదని.. ఈ భూమిని గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కౌలుకు తీసుకొని.. కౌలు డబ్బులు అడితే.. తమను కొట్టి మీరు టీడీపీ వారని.. కౌలు ఇచ్చేది లేదని పొలంలోకి వస్తే చంపేస్తామని బెదరించారని.. పిన్నెల్లి అనిమిరెడ్డి తనను జుట్టపట్టుకొని రోడ్డులో ఇడ్చి కొట్టాడని.. వారిపై సీఐకి వెళ్లి చెబితే ఇంకోసారి పోలీస్ స్టేషన్‌లోకి వస్తే తమపైనే తిరిగి చీటింగ్ కేసు పెడతామని బెదిరించాడని.. దీనిపై ఇప్పటికి ఎన్నో అర్జీలు పెట్టినా తమకు ఎక్కడా న్యాయం జరగలేదని.. దయ చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.



- గుంటూరు జిల్లా పొన్నూరు మండలం గొళ్లమూడిపాడు గ్రామానికి చెందిన తుమ్మల పార్వతి గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత పంచాయతీ పాలకులు మురుగు కాలువను నిర్మించి ఆ కాలువ మీదుగా పోయే నీటిని నిర్లక్ష్యంగా పొలాల్లోకి వదిలివేయడంతో పంటలు పండే భూములు చౌడుబారి పనికిరాకుండా పోతున్నాయని దయ చేసి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన పుల్లయ్య గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తనకు పాయకాపురంలోని రాధా రంగా నగర్ లో బిల్డింగ్ కలదని.. ఆ బిల్డింగ్ తాలుకా కాగితాలు గాంధీ కో ఆపరేటీవ్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.12 లక్షలు తీసుకొని తిరిగి మొత్తం చెల్లించాక కూడా.. బ్యాంకు వారు తమ ఇంట్లోకి వచ్చి అద్దెకు ఉన్నవారిని కులం పేరుతో తిట్టి సామాన్లు బయట పడేసిన బ్యాంక్ మేనేజర్ వారి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశాడు.
- శ్రీ సత్యసాయి జిల్లా గుడిబండ మండలం కోంకల్లు గ్రామానికి చెందిన హెచ్. హనుమేష్ గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వైసీపీ నేత అక్రమంగా ఆక్రమించుకొని తమను ఇబ్బంది పెడుతున్నాడని.. దీనిపై కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని.. దయ చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

## టిడ్కో కాలనీల్లో ఎంఎస్ఎంఈ యూనిట్లతో మహిళలకు జీవనోపాధి

- 163 ప్రాంతాల్లో జీవనోపాధి కేంద్రాల ద్వారా శిక్షణ, స్వయం ఉపాధి కల్పన
- ఈ ఏడాది పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారుచేయడమే లక్ష్యం
- యూనిట్ల అధ్యయనానికి హైదరాబాద్ లో మంత్రి నారాయణ బృందం పర్యటన
- ప్రగతి నగర్‌లో ఎలీప్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ సందర్శన

**అమరావతి/హైదరాబాద్, మహానాడు:** రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ఏపీ మున్సిపల్ శాఖ వేగంగా అడుగులు ముందుకు వేస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకోగా పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను రూపొందించాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నారు. దీనికోసం ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కొంతకాలంగా అధ్యయనం చేస్తోంది.

రాష్ట్రంలోని టిడ్కో గృహాల్లో నివసించే మహిళల ద్వారా ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పి వారికి జీవన భృతి కల్పించాలని నిర్ణయించింది. టిడ్కో నివాస సముదాయాల్లో ఖాళీ స్థలాలున్న 163



ప్రాంతాల్లో పట్టణ పేదరిక సంస్థ ద్వారా లైవ్ లీ హుడ్ సెంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ జీవనోపాధి కేంద్రాల్లో(లైవ్ లీ హుడ్ సెంటర్ లు) మహిళలకు వివిధ నైపుణ్యాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారితో ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయిస్తారు. అయితే ఎలాంటి యూనిట్లు ఏర్పాటుచేయాలి. ఏయే యూనిట్ల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుంది,ఎలాంటి సాంకేతిక ఉపయోగించాలనే దానిపై అధ్యయనం చేస్తున్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా హైదరాబాద్ లోని ప్రగతినగర్ లో మహిళా పారిశ్రామిక వేత్తల అసోసియేషన్(ఎలీప్)ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ను సందర్శించింది మంత్రి నారాయణ బృందం. ఈ పర్యటనలో మంత్రి నారాయణతో పాటు మెప్మా, టిడ్కో ఎండీలు, పరిశ్రమల శాఖ అధికారులు ఉన్నారు. ఎంఎస్ ఎంఈ పార్క్ లో ఉన్న స్టార్టప్ కంపెనీలతో పాటు పలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను సందర్శించి వాటి యజమానుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కంపెనీల ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాల్సిందిగా పరిశ్రమల శాఖ, పురపాలక శాఖ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రి నారాయణతో పాటు మెప్మా ఎండీ తేజ్ భరత్, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ ఏపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డికి భద్రత పెంపు

- ఇక నుంచి 'ఎక్స్' కేటగిరీ సెక్యూరిటీ
- ఏపీ సర్కారుతో అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ



**ఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్టీ సీనియర్ నేత ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి కి కేంద్ర ప్రభుత్వం 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పించింది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర భద్రతా వ్యవహారాల కమిటీ సమావేశం, కేంద్ర హోంశాఖ, కేంద్ర నిఘా సంస్థల మధ్య నిర్వహించిన సంప్రదింపుల అనంతరం, జాతీయ స్థాయి వీఐపీ రక్షణ విభాగం ఈ భద్రతా కేటగిరీని కేటాయించింది. 2025 ఏప్రిల్ 1వ జరిగిన సమావేశం నిర్ణయం మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (వీఐపీసెక్యూరిటీ విభాగం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. కేంద్రం

పంపిన ఉత్తర్వుల ప్రకారం, ఈ భద్రతా ఏర్పాట్లు తక్షణమే అమలులోకి రావాలని స్పష్టం చేశారు.

ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విష్ణు వర్ధన్ రెడ్డికి తగిన భద్రతా ఏర్పాట్లు వెంటనే కల్పించాల్సిందిగా కేంద్రం సూచించింది. ఇకపై ఆయన భద్రతపై సమగ్ర పర్యవేక్షణను కేంద్ర హోంశాఖ చేపడుతుంది. సొంత రాష్ట్రమైన ఏపీతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఆయన పర్యటించే సమయంలో ఈ భద్రత అమలులో ఉంటుంది. పార్టీలో సీనియర్ నేతగా, కేంద్రంలో కీలకమైన నామినేటెడ్ పదవుల్లో సేవలందించిన విష్ణు వర్ధన్ రెడ్డి ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీ తరపున కీలకంగా పనిచేశారు. గతంలో ఈయన భద్రత రాష్ట్ర నిఘా సంస్థల పరిధిలో ఉండేది. ఈ నూతన ఆదేశాల మేరకు కేంద్ర పరిధిలోకి మారడంతో ఇక నుంచి కేంద్రం కేంద్ర నిఘా సంస్థల పర్యవేక్షణ చేపట్టనుంది. ఈ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్‌తో పాటు అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీలు, ఢిల్లీ పోలీస్ సెక్యూరిటీ విభాగానికి పంపించి, ఆయన పర్యటనల సమయంలో ఆయన వ్యక్తిగత రక్షణ చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



అమరావతిలోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి హిందూపురం పార్లమెంట్ పరిధిలో జరుగుతున్నటువంటి, జరుగవలసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె పార్థసారథి



## వైసీపీ నేతలు రాజకీయ నాయకులు కాదు

- గాదె వెంకటేశ్వరరావు

**గుంటూరు, మహానాడు:** వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మాటలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఉన్నాయని, గతంలో వారు పోలీసుల పట్ల వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలందరూ గమనించారని, ఇప్పుడు అదే పోలీస్ శాఖ ని అవమానించే విధంగా మాట్లాడడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఇక్కడి లాడ్జి సెంటర్ లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి వచ్చిన సందర్భం ఏమిటి, అక్కడ మాట్లాడిన విషయాలు ఏమిటి, ఎక్కడ ఏ విధంగా ప్రవర్తించాలో కూడా కనీస అవగాహన లేని వ్యక్తి అని ఆయన అన్నారు.

గత ఎన్నికలలో ఆయన స్థాయి ఏమిటో గుర్తు చేసినా, వైసీపీ నాయకుల తీరు మారట్లేదని అన్నారు. వైసీపీ నాయకులు ఎవరు కూడా రాజకీయ నాయకులు కాదని, అది ఒక దొంగల సమూహం అని, దొంగ వ్యాపారానికి అడ్డా అని దుమ్మెత్తిపోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు, జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ శిఖా బాలు, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, కార్పొరేటర్ ఎర్రం శెట్టి పద్మావతి, తాడికొండ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025 ||

● నత్తలూ నవ్వుతున్నాయ్






# నాయకా.. పారిపో.. పారిపో!

- 'సుప్రీం'కు వెళ్లే దాకా వదిలేసిన 'సూపర్ పోలీస్'!
- కిరణ్‌ను కనిపెట్టిన సిగ్నల్స్ ఆ ముగ్గురినీ కనిపెట్టలేకపోయాయా?
- కాకాణి ,మిథున్‌రెడ్డి, డాక్టర్ ప్రభావతిలను వదిలేసిన పోలీసులు
- హైకోర్టులో బెయిల్ పిటిషన్ కొట్టేసిన వైనం
- వెంటనే అరెస్టుకు వేటాడని పోలీసు బాసులు
- ఆలోగా సుప్రీంకోర్టుకు వెళ్లి సేఫ్ అయిన వైకాపా నేతలు
- ఈలోగా కాకాణి ఖాకీల కళ్లు గప్పి పరాయిన కాకాణి
- మిథున్, పెద్దిరెడ్డిని ఎవరు రక్షిస్తున్నారంటూ తమ్ముళ్ల ఫైర్
- టీడీపీ అధికారంలో ఉన్నా చిత్తూరు, అన్నమయ్యలో ఇంకా పెద్దిరెడ్డి హవానా? హవ్వ!
- జగన్ హయాంలో టీడీపీ నేతలను ఖాకీలు ఇలాగే వదిలేశారా?
- హైదరాబాద్ వెళ్లి రఘురామరాజును ఎత్తుకొచ్చిన పోలీసులు
- ఆ తెగువ ఇప్పుడు ఏదంటూ పసుపు సైనికుల ఫైర్

(మార్తి సుబ్రహ్మణ్యం)

రౌతు మెత్తనయితే గుర్రం మూడుకాళ్లమీద నడుస్తుందట.. పాలకుడి బట్టే పాలితులు. రాజును బట్టే భటుడు. ఇవన్నీ మనం చిన్నప్పటి నుంచి వింటున్న సామెతలే. అవి ఇప్పుడు 'మంచి ప్రభుత్వం'లో నిజమవుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న పార్టీని, ఒకప్పుడు వేటాడి వెంటాడి.. వేధించిన వారిని అరెస్టు చేయాల్సిన పోలీసుల మీనమేషాలు.. వైకాపేయులకు శ్రీరామరక్షగా మారుతోందన్న తమ్ముళ్ల ఉవాచ.

హైకోర్టులో వారి బెయిల్ పిటిషన్ కొట్టేసిన వెంటనే రంగంలోకి దిగి, నిందితులను చెరపట్టాల్సిన ఖాకీలు కళ్లు మూసుకుంటే.. నిందితులు ఎంచక్కా సుప్రీంకోర్టుకు వెళ్లి రక్షణ తెచ్చుకుంటున్నారు. కాదు.. తెచ్చుకునేలా పోలీసులే అవకాశం ఇస్తున్నారు! మరి జగన్ జమానాలో ఖాకీలు, ఇలాగే కళ్లు మూసుకున్నారా అన్నది పసుపు సైనికుల ప్రశ్న. ఇంత 'మంచి ప్రభుత్వం'లో.. ఇంత'మంచి పోలీసులు'ండటం ప్రతిపక్ష వైకాపాకు వరమే కదా?

ఏపీలో పోలీసుల వేగం చూసి నత్తలు కూడా నవ్వుకుంటున్నాయన్నది, పసుపు సైనికుల ఉవాచ. హైకోర్టులో బెయిల్ పిటిషన్ రద్దయిన ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి చక్రపాణిరెడ్డి, డాక్టర్ ప్రభావ తిని వెంటనే అరెస్టుచేయడంలో.. పోలీసులు చేసిన జాప్యమే వారికి సుప్రీంకోర్టులో ఊరట లభించేందుకు కారణమయిందన్నది, త మ్ముళ్ల ఆగ్రహానికి అసలు కారణం.

సహజంగా ఒక నిందితుడిని పట్టుకునేందుకు, పోలీసులు వాడే సాంకేతిక టెక్నిక్కులు కొన్ని ఉంటాయి. అందులో ప్రధానమైనది నిందితుల ఫోన్ సిగ్నల్స్‌ను కనిపెట్టడం. ఇప్పుడు వైఎస్ భారతిరెడ్డిని దూషించారంటూ, కేసు నమోదయిన కిరణ్ ఆచూకీని కూడా అతని ఫోన్ సిగ్నల్‌ను ట్రేస్ చేసిన తర్వాత అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించటం ప్రస్తావనార్హం.

ఇదే సిగ్నల్స్ ద్వారా టీడీపీ కార్యకర్తను పట్టుకోగలిగిన పోలీసులు.. ఒక ప్రభుత్వ డాక్టరయిన ప్రభావతి, ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి చక్రపాణిరెడ్డి సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను, ఎందుకు కనిపెట్టలేకపోయాయన్నది తమ్ముళ్ల వాదన. అది కూడా దొరక్కపోతే.. వారి వద్ద ఉన్న గన్‌మెన్లను విచారించినా ఆచూకీ లభిస్తుంది. ఇది సహజంగా నిందితులను పోలీసులు వేటాడే ప్రక్రియలో భాగం. అసలు వారి బెయిల్ పిటిషన్లు హైకోర్టులో తిరస్కరించిన వె ంటనే పోలీసులు రంగంలోకి దిగి, అరెస్టు చేస్తారని పార్టీ కార్యకర్తలు భ్రమపడ్డారు. ఎందుకంటే గతంలో జగన్ ప్రభుత్వం కూడా ఇదే పద్ధతి అనుసరించింది కాబట్టి! గత ఐదేళ్లలో అసలు ఎఫ్ఐఆర్ లేకుండానే వందల మందిని అరెస్టు చేసింది.

గతంలో నిందితుల పిటిషన్లు కొట్టేసినప్పుడు పోలీసులు ఒక విచిత్ర పద్ధతులు పాటించేవారు. కోర్టు ఆవరణలో వివిధ వేషాల్లో ఉండే కానిస్టేబుళ్లు, నిందితులు బయటకు వచ్చినప్పుడు నేర్పుగా ఎత్తుకెళ్లేవారు. నిందితుల బంధువుల ఇళ్ల వద్ద నిఘా పెట్టేవారు. ఇదంతా ఒకప్పటి పద్ధతి. ఇప్పుడు ఏకంగా నిందితుల కుటుంబ సభ్యులనే పోలీసుస్టేషన్లను పిలిపిస్తున్నారు. అది వేరే విషయం. ప్రస్తుతం 'చాలా అంశాల్లో' జగన్ విధానాలనే అనుసరిస్తున్న ప్రభుత్వం.. వైసీపీ నేతల అరెస్టు విషయంలోనూ, అదే పద్ధతి అనుసరిస్తుందని పసుపు సైనికులు భావించారు. కానీ పేరుగొప్ప పోలీసులు.. నిందితులను సుప్రీంకోర్టు వరకూ వెళ్లనిచ్చి, వారు రక్షణ తెచ్చుకునేంత స్వేచ్ఛ కలిగించడంపైనే, ఇప్పుడు తమ్ముళ్లు విరుచుకుపడుతున్నారు.

పోలీసుల నత్తనడక వల్ల మాజీ మంత్రి కాకాణి చక్రపాణిరెడ్డి సురక్షితంగా తప్పించుకోగలిగారు. దానితో రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైకోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్ కొట్టివేసినప్పుడు, ఆయన హైదరాబాద్‌లోని తన ఇంట్లోనే ఉన్నట్లు ఫొటోలు విడుదల చేశారు. కాకాణి ఎక్కడికీ పారిపోలేదని చెప్పేందుకు ఆ ఫొటోలు విడుదల చేశారు. కానీ తర్వాత ఆయన ఆచూకీ మాయమయింది. నిజానికి పోలీసులు హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే అరెస్టు చేసి ఉంటే, కాకాణిని జైల్లో వేసే అవకాశం ఉండేది కదా అని, నెల్లూరు తమ్ముళ్లు విరుచుకుపడుతున్నారు.

## చిత్తూరు, అన్నమయ్యలో టీడీపీ ఉందా?

ఇదిలాఉండగా.. రాష్ట్రంలో తమ పార్టీనే అధికారంలో ఉన్నప్పటికీ, చిత్తూరు-అన్నమయ్య జిల్లాల్లో మాత్రం ఇంకా వైసీపీ అగ్రనేత.. పెద్దిరెడ్డి రాజ్యమే నడుస్తోందన్న ఆగ్రహం ఇటీవలి కాలంలో తమ్ముళ్లలో పెల్లుబుకుతోంది. చివరకు పెద్దిరెడ్డిపై పోటీ చేసి ఓడిన నేతను సైతం.. ఆయన సొంత మండలానికే పరిమితం చేశారని, నియోజకవర్గంలో సైతం ఆయన మాట చెల్లడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఆ రెండు జిల్లాల్లో పెద్దిరెడ్డి చెప్పిన వారికే అన్ని శాఖల్లో పోస్టింగులు దక్కుతున్నాయన్న అసంతృప్తి తమ్ముళ్లలో ర గులుతోంది. దానితో అధికారం పోయినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎవరు కాపాడుతున్నారన్న చర్చ జరుగుతోంది.



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్



జపాన్ పర్యటనలో మల్లారెడ్డి దంపతులు
జపాన్ ట్రెడిషనల్ దుస్తుల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



## అమర్తలూరు మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

**అమర్తలూరు, మహానాడు:** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనంద బాబు పాల్గొని, మాట్లాడారు. వేమూరు నియోజకవర్గంలో అనుకున్న దానికంటే కూడా సభ్యత్వ నమోదు ఎక్కువ చేశారు. అభినందనలు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి 60 మంది ఓటర్లకు కుటుంబ సాధికార సారథులను నియమించుకోవాలి. రాబోయే రోజుల్లో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి, అన్ని కమిటీలను నియమించుకోవాలని సూచించారు.

## లోకాయుక్త, ఉపలోకాయుక్త నియామకం

**అమరావతి, మహానాడు:** లోకాయుక్త, ఉపలోకాయుక్త నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఆర్‌సీచైర్ పర్సన్, మెంబర్స్ ను నియమించింది. చైర్ పర్సన్ గా జస్టిస్ షమీమ్ అక్తర్, లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖరరెడ్డి, ఉపలోకాయుక్తగా జస్టీస్ బీఎస్ జగ్జీవన్ కుమార్, హ్యూమన్ రైట్స్ కమీషన్ మెంబర్స్ గా శివాది ప్రవీణ, డాక్టర్ బి కిషోర్ లను నియమించింది.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి సేవలో 'శ్రీవారి సేవకులు'

**ఒంటిమిట్ట, మహానాడు:**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు శ్రీవారి సేవకులు విశేష సేవలందిస్తున్నారు. సాధారణ రోజులలో కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, రాయచోటి నుండి దాదాపు వెయ్యమంది, ఏప్రిల్ 11వ తేదీ శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా ఎండ వేడిని కూడా లెక్కచేయకుండా 2,500 మందికి పైగా శ్రీవారి సేవకులు సేవలందించారు. శుక్రవారం శ్రీసీతారాముల కల్యాణానికి విచ్చేసే లక్షలాదిమంది భక్తులకు అందజేసేందుకు పీఏసీలో అక్షింతలు, ముత్యం, కంకణం కలిపి ప్యాక్ చేశారు. అదేవిధంగా అన్నప్రసాదాల ప్యాకింగ్, పంపిణీ, వాటర్ బాటిళ్ళు, మజ్జిగ ప్యాకెట్లు, క్యూలైన్ల క్రమబద్ధీకరణలో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు స్వామివారిపై ఉన్న భక్తితో ఉదయం 8 నుండి రాత్రి 10 గంటల వరకు బ్రహ్మోత్సవాలలో వివిధ విభాగాలలో సేవలందిస్తున్నారు.





# బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, మహానాడు:** జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడు, సమ సమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని శు క్రవారం పట్టణం తాలూకా సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.

### గొప్ప సంఘసంస్కర్త..

**వినుకొండ:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మానవతావాది మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యుడు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో కూటమి నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, కుల వివక్షతపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్య అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కూటమి నాయకులు కొనిజేటి నాగ శ్రీను రాయల్, శంకర్రావు శ్రీనివాసరావు, లాయర్ సైదారావు, పివి సురేష్ బాబు, పెమ్మసాని నాగేశ్వరరావు, ముంద్రు సుబ్బారావు, మురళి యాదవ్, రైతు నరేంద్ర, ఆయుబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

### అణగారిన వర్గాల ఆశాజ్యోతి...

**గుంటూరు:** అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం తపించి వారి అభివృద్ధి కొరకు తన జీవిత కాలం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీ రావ్ పూలే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హిందూ కళాశాల కూడలిలోని ట్రావెలర్స్ బంగ్లాలో గల పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. పూలే గారి స్ఫూర్తితో అసమానతలు లేని సమ సమాజ నిర్మాణానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వోబీసీ మోర్చా గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే వెంకట శేషగిరిరావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, జితేంద్ర గుప్త, నాగరాజు, పరమేశ్వర రావు, శివరామకృష్ణ ప్రసాద్, శివన్ నారాయణ, ఓలేటి శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 13 నుంచి 25వ తేదీ వరకు అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు

● భా.జ.పా. రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

**హైదరాబాద్:** భారతీయ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని, ఏప్రిల్ 13 నుంచి 25వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో విస్తృతమైన కార్యక్రమాలు నిర్వహించ నుంది.

### ఏప్రిల్ 13వ తేదీ కార్యక్రమాలు

రాష్ట్రంలోని ప్రతి బూత్, గ్రామ, మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించి, అంబేద్కర్ విగ్రహాల వద్దకు వెళ్లి శుభ్రపరిచి దీపాలంకరణ చేస్తారు. కేంద్ర మంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి , హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు.

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , కరీంనగర్ లోని అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి శుభ్రపరిచి, పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. రాజ్యసభ సభ్యులు డా. కె.



లక్ష్మణ్ , జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ , ఎంపీ ఈటల రాజేందర్ తో పాటు పార్టీకి చెందిన ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పదాధికారులు, కార్యకర్తలు తమ తమ జిల్లా కేంద్రాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు.

### ఏప్రిల్ 14వ తేదీ - అంబేద్కర్ జయంతి

రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, స్థానిక పురప్రముఖులు, దళిత, బహుజన నేతలు, ఉద్యమకారులతో కలిసి భారత రాజ్యాంగ పీఠికను చదివించే కార్యక్రమాన్ని బిజెపి చేపడుతుంది.

### ఏప్రిల్ 15 - 25 తేదీల మధ్య సదస్సులు.

ప్రతి జిల్లా కేంద్రంలో ప్రముఖ మేధావులు, కవులు, కళాకారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సంఘసంస్కర్తలు, కార్మిక సంఘాల నేతలతో కలిసి సెమినార్లు నిర్వహించబడతాయి. ఈ సమావేశాలకు బిజెపి రాష్ట్ర శాఖ నుండి ఇద్దరు ముఖ్య అతిథులు హాజరై ప్రసంగిస్తారు. ఈ సెమినార్లలో ప్రధానంగా ఈ అంశాలు చర్చించబడతాయి. అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం వల్ల దేశ ప్రజలకు లభించిన హక్కులు, స్వేచ్ఛ గురించి, గత 74 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ గారిని ఎలా మోసం చేసిందో వివరణ, అలాగే గత పదేళ్లుగా బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ కి అందించిన గౌరవం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం.

### దళిత కుటుంబాలతో సామూహిక భోజనాలు:

బిజెపి నాయకులు, కార్యకర్తలు స్థానిక దళిత కుటుంబాల ఇండ్లకు వెళ్లి వారి కుటుంబాలతో కలిసి భోజనం చేయడం.

తెలంగాణ వ్యాప్తంగా అంబేద్కర్ జయంతిని ఘనంగా జరిపేందుకు బిజెపి నాయకులు, కార్యకర్తలు కృషి చేసి విజయవంతం చేయాలని కోరుతున్నాం. సమాజంలోని అన్ని వర్గాల వారికి అంబేద్కర్ సందేశాలను చేరవేయాలన్నదే బిజెపి లక్ష్యం.




తన తనయుడి జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వరుని దర్శించి రాహుకేతు పూజలు నిర్వహించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



మణుగూరు మండలం కూనవరంలో సన్న బియ్యం లబ్ధిదారురాలు సుబ్బలక్ష్మి ఇంట్లో భోజనం చేసిన తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... ఆయన వెంట ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్, ఐటిడిఎ పిఓ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు

ఒంగోలు జీజీహెచ్ పనితీరును సమీక్షిస్తున్న వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్



08

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025 ||









## రామరాజ్యం తేవాలన్నదే
# నా ఆకాంక్ష

**మొదటి పేజీ తరువాయి..**

ఒంటిమిట్టలో జరిగిన శ్రీసీతారాముల కళ్యాణోత్సవంలో సీఎం చంద్రబాబు దంపతులు పాల్గొని స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

### సీతారాముల వారే వచ్చినట్లుంది

కన్నుల పండువగా ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణానికి భక్తులు తరలివచ్చారు. అంగరంగ వైభవంగా బ్రహ్మాండంగా కళ్యాణోత్సవం జరిగింది. ఇక్కడి వచ్చిన భక్త జనాన్ని చూస్తుంటే సీతారాముల వారు దిగొచ్చి కళ్యాణం చేసుకుంటున్నట్లుగా అనిపించింది. దేవుణ్ని దర్శించుకుని మనం కొన్ని సంకల్పాలు తీసుకుని తలచుకున్నాం. సీతారాముల వారు ఆదర్శ దంపతులు. పరిపాలన అంటే రామ పాలన రావాలి..రాముడి పాలన జరగాలని కోరు కుంటారు. సీతారాముల కళ్యాణాన్ని మన ఒంటి మిట్టలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. రాష్ట్ర విభజన తర్వాత కళ్యాణ మహోత్సవాన్ని ఒంటి మిట్టలో చేయాలని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించింది. 11వ శతాబ్ధంలో ఏకశిలా విగ్రహ రూపంలో ఏర్పాటైంది. ఈ ప్రాంతమంతా దేవుడి నామస్మరణంతోనే ఉండాలి. ఇక్కడి చెరువు ఆధునీ కరణకు పనులు ప్రారంభించాం.

### రామరాజ్యమే నా ఆకాంక్ష


దేవాలయాలు మన వారసత్వ సంపద.ఈ దేవాల యాలు లేకపోతే కుటుంబ వ్యవస్థ ఉండేది కాదు. ఏ దేశానికి లేని గొప్ప వారసత్వ సంపద మన దేశానికి ఉంది. మన తర్వాత వారసులకు కూడా మనం వారసత్వాన్ని అందించాలి. రాముడి పాలన ఇవ్వాలని, రామరాజ్యం తేవాలనేది నా ఆకాంక్ష. రాముడి సాక్షిగా చెప్తున్నా...ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే నా ఆలోచన, ధ్యేయం. రామరాజ్యంలో పేదరికం పోవాలి. స్వర్ణాంధ్రప్రదేశ్‌లో పేదరికం లేకుండా, ఆర్థిక అసమానతలు లేకుండా ఉండాలి. సంపాదనలో కొంత దేవుడుకి ఇచ్చి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. మానవ సేవే..మాధవ సేవ. దేవునికి సేవ చేయడం అంటే మనతో ఉన్న వారిని సమానంగా పైకి తీసుకురావడం. శ్రీరాముడి స్ఫూర్తితో పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరుతున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.
















## జనకపురిని తలపించిన
# కల్యాణ వేదిక కళాకృతులు

- తెలుగుదనం ఉట్టిపడేలా రాములవారి కల్యాణ వేదిక
- ప్రత్యేకంగా వరి గింజలతో మండపం

**ఒంటిమిట్ట, మహానాడు:**

ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతాయుగంనాటి జనకపురిని గుర్తుకు తెచ్చేలా కల్యాణవేదికను అందంగా తీర్చిదిద్దారు. వేదిక రంగురంగుల పుష్పాలతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. వేదికపై, ప్రాచీన ఆలయాలలోని కళాకృతులు, దశావతారాల సెట్టింగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి ముగ్ధులయ్యారు. ప్రత్యేకంగా వరి గింజలతో మండపం ఏర్పాటు, చెరుకులు, టెంకాయ గెలలు, టెంకాయపూత, అరటి ఆకులు, మామిడాకులు, మామిడికాయలు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఇందుకోసం 4 టన్నుల సంప్రదాయపుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరెంటెండెంట్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజులపాటు 120 మంది అలంకరణ నిపుణులు, 120 మంది టీటీడీ సిబ్బంది ఇందుకోసం పనిచేశారు.

## ఓ రామ నీ నామమేమి రుచిరా...
# రామభద్ర రఘువీర..

- నామ స్మరణతో మైమరిపించిన భక్తి సంగీతం

**ఒంటిమిట్ట, మహానాడు:** ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం కల్యాణ వేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన, కళాశాల విద్యార్థులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను మైమరిపించాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన " రామరామ రఘురామ పరాత్పర....., పాహి కళ్యాణ రామ పావన గుణ రామ....., ఎక్కడ జూచిన మన శ్రీ రాముడే....." తదితర సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అంతకుముందు మధ్యాహ్నం 3.30 గంటలకు కుప్పంకు చెందిన శ్రీ మూర్తి బృందం మంగళ ధ్వని ఆహుతులను అలరించింది.

### స్వామి, అమ్మవార్ల పూలమాలలు మార్చుకోవడమే ఎదుర్కోలు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం చెంత కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీ సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్ర కల్యాణవేదిక వరకు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కల్యాణవేదిక వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎదురెదురుగా ఉంచి పూలమాలలు మార్చుకునే ప్రక్రియనే ఎదుర్కోలు ఉత్సవం అంటారు. ఎదుర్కోలు ఉత్సవంలో అమ్మవారి తరఫున ఆచార్య చక్రవర్తుల రంగనాథ్ స్వామివారి తరఫున ఆచార్య ఆకెళ్ళ విభీషణ శర్మ పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 12, ఏప్రిల్ 2025 ||



## ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు పట్టాలు ఇవ్వలేదు

మేం 45 ఏళ్లుగా మంగళగిరి రత్నాల చెరువులో నివాసం ఉంటున్నాం. నేను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు నలుగురు కుమార్తెలు. నా భర్త ఇటీవలే మరణించారు. దశాబ్దాలుగా ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి రత్నాలచెరువులో జీవనం సాగిస్తున్నాం. గతంలో ఇక్కడ మంచినీరు కూడా లభించేది కాదు. ఎంతో మంది నాయకులు వచ్చారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. అయినా మాకు పట్టాలు ఇవ్వలేదు.

ఇప్పుడు నారా లోకేష్ చేతుల మీదుగా శాశ్వత ఇంటి పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా 45 ఏళ్ల కలను నారా లోకేష్ నెరవేర్చారు.

- ఇటికాల పెద్దింట్లమ్మ,
రత్నాలచెరువు, మంగళగిరి.



## లోకేష్ వల్లే ఇంటి పట్టా సాధ్యమైంది!



తాడేపల్లి మహానాడులో 40 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాం. మహానాడు కాలనీ ఏర్పడిన నాటి నుంచి అక్కడే నివసిస్తున్నాం. ఇంటి పట్టాల కోసం గతంలో ఎంతో మంది నాయకులను కలిసి విజ్ఞప్తి చేశాం. ఎవరివల్లా కాలేదు. నారా లోకేష్ వల్లే ఇంటి పట్టా సాధ్యమైంది. ఇక్కడకు వచ్చిన తర్వాత సదుపాయాలు బాగా ఉన్నాయి. మర్యాదగా చూసుకున్నారు. లోకేష్ చేతుల మీదుగా శాశ్వత ఇంటి పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. మా కల నెరవేరింది.

- సాలిపల్లి రేయమ్మ, దుర్గారావు,
మహానాడు 6వ రోడ్డు, తాడేపల్లి.

## లోకేష్ ప్రజల రుణం తీర్చుకుంటున్నారు



మంగళగిరి రత్నాలచెరువులో 42 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాను. పట్టాల విషయంలో ఎంతో మంది నాయకులు వచ్చి కాకమ్మ కబర్లు చెప్పి వెళ్లిపోయారు. లోకేష్ మొదటి సారి గెలిస్తే ఇంటిపట్టాలు ఇచ్చేవారేమో. దురదృష్టం ఆయన గెలవలేదు. ఆయనేంటో ప్రజలకు అర్థం కాలేదు. రెండోసారి మంచి మెజార్టీతో గెలిపించినందుకు లోకేష్ ప్రజల రుణం తీర్చుకుంటున్నారు. 42 ఏళ్ల కల నిజమైనందుకు ఆనందంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు లోకేష్ కి ధన్యవాదాలు.

- నాగులపల్లి వెంకట సత్యనారాయణ

## ఇంటి పట్టా కోసం తిరిగి తిరిగి వేశారాం..



మేం 13 ఏళ్లుగా మంగళగిరి రత్నాలచెరువులో నివాసం ఉంటున్నాం. నేను రిక్షాబండి నడపుకుంటుండగా.. నా భార్య కూలి పనులకు వెళుతుంది. గతంలో ఇంటి పట్టా కోసం అనేక సంవత్సరాలు నాయకుల చుట్టూ తిరిగి తిరిగి వేసారాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు నారా లోకేష్ బట్టలు పెట్టి శాశ్వత ఇంటి పట్టా ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రత్నాల చెరువులో రోడ్లు వేశారు. ఇక్కడకు వచ్చి ఇంటి పట్టా అందుకుని సంతోషంగా వెళ్తున్నాం.

- -గరిక రాములు, రమణమ్మ, రత్నాలచెరువు, మంగళగిరి.

## 40 ఏళ్లుగా ఇంటి పట్టా కోసం ఎదురు చూస్తున్నాం..



మేం మంగళగిరి రత్నాలచెరువు ఎస్టీకాలనీలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. చిల్లరకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. నా చిన్ననాటి నుంచి ఇక్కడే పెరిగా. ఇంటి పట్టా కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.

ఎన్నికల సమయంలో నారా లోకేష్ వచ్చి.. శాశ్వత ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అన్నట్లుగా పట్టా ఇచ్చి.. మాట నిలబెట్టుకున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది.

-కొండా శివమ్మ, రత్నాలచెరువు, మంగళగిరి.

## రూపాయి ఇవ్వకుండా ఆస్తిపై హక్కు కల్పించారు!

మా తండ్రి 40 ఏళ్ల క్రితం మంగళగిరి రత్నాలచెరువులో రూ.150తో పూరిపాకను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి మేం ఆ ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. లోకేష్ వచ్చిన తర్వాత ఆస్తిపై మాకు శాశ్వత హక్కు కల్పించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆయనే నిజమైన హీరో. మేం ఇంటి పట్టా కోసం ఎవరికీ రూపాయి ఇవ్వలేదు. ఎవరి చుట్టూ తిరగలేదు. అధికారులే వచ్చి కొలతలు తీసుకున్నారు. ఇవాళ లోకేష్ చేతుల మీదుగా ఇంటి పట్టా అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- బందరు రాజ్యలక్ష్మి, సుబ్బారావు.



# యుద్ధప్రాతిపదికన మంగళగిరి హామీలు అమలు

- 13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది
- అంతర్జాతీయ ప్రమాణాలతో నియోజకవర్గంలో మొదటి పాఠశాల
- నాలుగో రోజు 600 ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్

**మంగళగిరి, మహానాడు:** మంగళగిరి నియోజకవర్గానికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు ఉదయం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో రత్నాల చెరువుకు చెందిన 600 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. కొన్ని నిర్ణయాలు జీవితాలనే మార్చేస్తాయి. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో నేనొక నిర్ణయం తీసుకున్నా. మీ సమస్యలేంటో నాకు తెలియదు. నేనేంటో మీకు తెలియదు. ఎన్నికలకు 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా పోటీచేశా. 5,300 ఓట్లతో ఓడిపోయా. మొదటి రోజు బాధ కలిగింది, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ప్రజలకు మంచి పనులు చేసి వారి మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నేను నిర్ణయించుకున్నా.

### ప్రతిపక్షంలో ఉన్నప్పుడే 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం

ఒక్కసారి ఆలోచించండి. 2019 నుంచి 2024వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మీ ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని తీసుకురావడం జరిగింది. తాడేపల్లిలో, మంగళగిరిలో, దుగ్గిరాలలో క్లినిక్ ఏర్పాటుచేసి నేటికీ కొనసాగిస్తున్నాం. ఈ రోజుకీ సొంత నిధులతో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.



కుటుంబంలో పెళ్లి జరిగితే పెళ్లి కానుక ఇస్తున్నాం. మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడంతో పాటు శిక్షణ కూడా అందించాం. వారికి ఉపాధి కూడా కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం నీరు సక్రమంగా అందించలేకపోతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. యువత క్రికెట్ ఆడేందుకు మంగళగిరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటుచేశాం. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు మందులు అందించాం. అమెరికా డాక్టర్ల ద్వార టెలిమెడిసిన్ అందజేశాం. ఈ విధంగా దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం చేపట్టాం.

### ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమని చెప్పా..

2024 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేయాలని చాలా మంది చెప్పారు. ఐదేళ్లు కష్టపడ్డా, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకున్నానని ఆనాడు చెప్పా. ఒకే స్థానం నుంచి పోటీ చేస్తా.. అది మంగళగిరి నుంచే పోటీచేస్తానని చెప్పా. ప్రచారంలో మీ వద్దకు వచ్చాను. ఏ మెజార్టీతో అయితే ఓడిపోయానో దాని పక్కన సున్నాపెట్టి 53వేల ఓట్లతో గెలిపించాలని కోరా. మీరు ఎంత



ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా. సర్వేల్లో కుప్పం కంటే ఒక్క శాతం వెనుకబడి ఉన్నాం. మీరు చూపించిన అభిమానం, ప్రేమ చూసి ఒక్క ఓటు అన్నా ఎక్కువ వస్తుందని బాబుతో ఛాలెంజ్ చేశా. మంగళగిరి ప్రజలు ఎవరూ ఊహించని విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారు.


### 13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మీరు ఇచ్చిన మెజార్టీ కొండంత బలం. దశాబ్దాల కల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి. ఏపీలో మొదటి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంగళగిరి నియోజకవర్గానికి శాంక్షన్ అయింది. ఈ నెల 13న శంకుస్థాపన చేస్తున్నాం. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. చిల్లపల్లి బాధ్యత తీసుకుంటారు. పార్క్ లు, చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, కరెంట్ ప్రాజెక్టులు చేపడుతున్నాం. జూన్, జులైలో ఆ కార్యక్రమాలు కూడా చేపడతాం. కొండ దిగువన లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనం తర్వాత పానకాల స్వామి గుడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చాలామంది చెప్పారు. దీంతో ఉచితంగా బస్సు ఏర్పాటుచేశాం. మంగళగిరి, తాడేపల్లి నుంచి ఎయిమ్స్ కు వెళ్లేందుకు రెండో బస్సు కూడా ఉచితంగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేశాం. ఇచ్చిన ప్రతి హామీ పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటూ పోతున్నాం.

### రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది

దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు శాశ్వత ఇంటి పట్టా ఇవ్వాలని ఆనాడు కోరారు. తొలి విడత సంవత్సరంలోగానే ఇస్తానని చెప్పా. ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేందుకు మరో సంవత్సరం పడుతుందని ఆనాడే చెప్పా. అటవీ, కాలువ, కొండపోరంబోకు భూములకు కొంత సమయం పడుతుంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే మీ లోకేష్ ఈ రోజు మీ ముందు నిలబడ్డాడు.

కూటమి నాయకులందరూ కలిసికట్టుగా అధికారులతో మీ



ఇంటికి వచ్చి కప్పు కాఫీ కూడా తాగకుండా కొలతలు తీసుకుని వివరాలు సేకరించారు. రెవెన్యూ మంత్రి అనగానితో మాట్లాడి సహకరించాలని కోరా. ఈ జీవో రాష్ట్ర ప్రజలకు కూడా పనికి వస్తుందని చెప్పా. అనగాని గారి ప్రోత్సాహంతో ఈ రోజు మంగళగిరి నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారుగా 3200 కుటుంబాలకు ఉచితంగా ఇంటి పట్టాలు ఎన్డీయే ప్రభుత్వం అందజేస్తోంది. ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.

### అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల

ఈ ఆస్తి విలువ వెయ్యి కోట్ల రూపాయలు. నేనిచ్చే పట్టాతో వెంటనే రిజిస్టర్ చేసుకోవచ్చు. రెండేళ్ల తర్వాత అమ్ముకునే హక్కు కూడా వస్తుంది. శాశ్వత హక్కు ఎన్డీయే ప్రభుత్వం మీకు అందజేస్తోంది. ఇది మనందరి దశాబ్దాల కల. ఆ హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం. విద్యాశాఖ మంత్రిగా లీప్ (లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి స్కూల్ మంగళగిరి నియోజకవర్గంలోనే అభివృద్ధి చేయబోతున్నాం. 50 రోజుల్లో పాఠశాల రూపురేఖలు మారిపోవాలని అధికారులతో చెబుతున్నా. పట్టుదలతో పనిచేస్తున్నా.

### ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

మంగళగిరి ప్రజలు అన్నివిధాలుగా నాకు అండగా నిలిచారు. అవినీతి రహిత పాలన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మంగళగిరి ప్రజలను నా గుండెల్లో పెట్టుకుని అహర్నిశలు పనిచేస్తా. సూపర్ సిక్స్ లో కొన్ని హామీలు మే నెలలో నిలబెట్టుకోబోతున్నాం. మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని చెప్పారు.









# "రాజేంద్ర ప్రసాద్ అన్నయ 'షష్టి పూర్తి' చూడండి - రవితేజ

నటకిరీటి డా. రాజేంద్రప్రసాద్, జాతీయ ఉత్తమ నటి అర్చన కాంబినేషన్ లో రూపేష్,ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'షష్టి పూర్తి ' . పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మేస్ట్రో' ఇళయరాజా ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. ఇందులో తొలిపాటను ఆస్కార్ విన్నర్




కీరవాణి రచించగా ఇటీవల విడుదల చేశారు.సంచలన సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ విడుదల చేసిన ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ లభించింది. రెండో పాటను 'మాస్ మహారాజా' రవితేజ ఆవిష్కరించి, యూనిట్ కి బెస్ట్ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ –"మా రాజేంద్రప్రసాద్ అన్నయ్య 'షష్టి పూర్తి' చూడండి.. డెఫినెట్ గా బావుంటుంది. మంచి ఫీల్ గుడ్ సినిమా అవుతుందనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు,ఆర్టిస్టులకు అందరికీ ఆల్ ది బెస్ట్ " అని చెప్పారు.

" ఇరు కనులు కనులు కలిసి మురిసె మొదటి చూపులో తొలి పిలుపు తగిలి మెరుపు మెరిసే మనసు నింగిలో "...అంటూ రెహమాన్ రాసిన ఈ పాటను ఎస్పీ చరణ్ , విభావరి ఆలపించారు. ఆ విశేషాలను దర్శకుడు పవన్ ప్రభ తెలియజేస్తూ "సినిమాలో చాలా అందమైన యుగళ గీతం ఇది. ఇళయరాజా గారు బాణీ ఇవ్వగానే నాకు 'సాగర సంగమం' లో 'మౌనమేలనోయి 'పాటలాంటి గొప్ప పాట అవుతుందనే అనుభూతి కలిగింది. ఈ ట్యూన్ కి రెహమాన్ శరవేగంతో సాహిత్యం సమకూర్చారు. ఇళయరాజా గారు ఒక్క కరక్షన్ కూడా చెప్పకుండా ఓకే చెప్పేశారు. ఎస్పీ చరణ్,విభావరితో ఈ పాట పాడించారు. అసలు ట్యూన్ వినగానే నాదీ, రూపేష్ మొహాలు వెలిగిపోయాయి. ఇక మొత్తం పాట రికార్డు అయ్యాక మా మొహాల్లో వెన్నెల కురిసినంత ఆనందం. అసలు ఈ పాట రికార్డింగ్ కూడా చాలా లవ్లీ గా ,లైవ్లీ గా జరిగింది. సింగర్స్ ఎవరిదారిన వాళ్ళు వచ్చి పాడి వెళ్లిపోకుండా ఇద్దరూ పక్క పక్కన నిలబడి ఓ ఫీల్ తో ఈ డ్యూయట్ ని ఆలపించారు. కథలో సమ్మిళితమైన ఈ పాట, ఈ సినిమాకే కొత్త అందాన్ని,అనుభూతిని తీసుకొచ్చింది.

ఈ పాట చిత్రీకరణని రాజమండ్రి లో ఈశ్వర్ నృత్య దర్శకత్వంలో తీశాం. మంచి ఎండల్లో అందరూ కష్టపడి,ఇష్టపడి ఈ పాట బాగా రావడానికి సహకరించారు. ముఖ్యంగా మా ఛాయాగ్రాహకుడు రామ్ రెడ్డి. మామూలుగానే గోదావరి అందంగా ఉంటుంది. ఇక తోట తరణి గారి కళా దర్శకత్వ నైపుణ్యం వల్ల ఈ పాటలో గోదావరి రెట్టింపు అందంతో కనిపిస్తుంది. మా హీరో హీరోయిన్లు రూపేష్,ఆకాంక్ష సింగ్ లపై ఈ పాటను చిత్రీకరించాం" అన్నారు.



# వేసవిలో 'హరి హర వీరమల్లు'

ఈ సంవత్సరం విడుదల కానున్న భారీ భారతీయ చిత్రాలలో 'హరి హర వీరమల్లు' ఒకటి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. సినీ అభిమానులంతా ఈ చిత్రం కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. చిత్ర నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం రీ–రికార్డింగ్, డబ్బింగ్ మరియు వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా రూపొందిస్తున్నారు, ప్రతి సౌండ్‌ను చక్కగా ట్యూన్ చేస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చిత్ర బృందం ఎక్కడా రాజీ పడకుండా, ప్రపంచం మెచ్చే గొప్ప చిత్రంగా మలచడానికి కృషి చేస్తోంది. ఈ వేసవిలో వెండితెరపై మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని ప్రేక్షకులకు అందించడానికి చిత్ర బృందం సిద్ధమవుతోంది. దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ గత ఏడు నెలలుగా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఎడిటింగ్ మరియు విఎఫ్ఎక్స్ మొదలుకొని మిగిలిన షూటింగ్ ను పూర్తి చేయడం వరకు ప్రతి విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా చేయడంలో జ్యోతి కృష్ణ పాత్ర కీలకం. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. అగ్ని లాంటి ఆవేశం, న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న యోధుడిగా.. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్ లో పవర్ స్టార్ కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఇది కేవలం కథ కాదు.. ఇది ఒక విప్లవం. న్యాయం కోసం యుద్ధం చేయనున్న వీరమల్లు, మే 9వ తేదీన థియేటర్లలో అడుగు పెట్టనున్నారు. 'హరి హర వీరమల్లు' చిత్రం మే 9న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ప్రేక్షకుల్లో నెలకొన్న భారీ అంచనాల నేపథ్యంలో ఈ చిత్రం సంచలన వసూళ్లు రాబడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, ఎ.ఎం. జ్యోతి కృష్ణ దర్శకులు. కరోనా మహమ్మారి మరియు పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైనప్పటికీ.. చిత్ర దర్శకత్వ బాధ్యతలు తీసుకున్న ఎ.ఎం. జ్యోతి కృష్ణ, ఎక్కడా రాజీ పడకుండా వేగంగా 'హరి హర వీరమల్లు' సినిమాని పూర్తి చేస్తున్నారు.




# హీరోయిన్ అనన్య నాగళ్ల లాంచ్ చేసిన మల్లేశం & 8 A.M.

మల్లేశం, 8 A.M. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ "23" తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదల టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సినిమా నుంచి కోసీ కోయ్యంగానే సాంగ్ లాంచ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ పాటని రా అండ్ రస్టిక్ ఎనర్జీ వున్న పవర్ ఫుల్ నెంబర్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి వరంగల్ శంకర్ రాసిన సాహిత్యం ఉద్రూత లూగించేలా వుంది. రేలా జాన్ సాంగ్ హై ఎనర్జీ తో పాడటం మరింత ఆలరించింది. ఈ సాంగ్ లో లీడ్ యాక్టర్స్ రస్టిక్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సన్నీ కూరపాటి అద్భుతమైన సినిమాటోగ్రఫీ. అనిల్ ఆలయం ఎడిటర్, లక్ష్మణ్ ఏలే ఆర్ట్ డైరెక్టర్.

# ఏప్రిల్ 18న 'జగమెరిగిన సత్యం'

అమృత సత్యనారాయణ క్రియేషన్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 గా తెరకెక్కిన చిత్రం జగమెరిగిన సత్యం. అచ్చ విజయ భాస్కర్ నిర్మించిన ఈ చిత్రానికి తిరుపతి పాలే దర్శకత్వం వహించారు. అవినాష్ వర్మ ఆద్య రెడ్డి, నీలిమ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్ర షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకొని ఏప్రిల్18న థియేటర్స్ లో గ్రాండ్ గా విడుదల కాబోతోంది. ఈ మూవీ నుండి ఏరువాక ఆగే అనే సాంగ్ ను ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెలంగాణ నేపద్యంలో 1994 లో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తిరుపతి పాలే. ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా నిర్మాత అచ్చ విజయ భాస్కర్ సినిమాను గ్రాండ్ గా నిర్మించారు. సురేష్ బొబ్బిలి అందించిన ఈ చిత్ర పాటలకు మంచి స్పందన లభిస్తోంది.



ఈ సందర్భంగా నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... జగమెరిగిన సత్యం టైటిల్ బాగుంది. నేను విడుదల చేసిన ఏరువాక ఆగే సాంగ్ ఎమోషనల్ గా ఉంది. మంచి కథ కథనాలతో వస్తోన్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయ్యి చిత్ర యూనిట్ అందరికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టాలని ఆశిస్తున్నాను అన్నారు. ఏప్రిల్ 18న ఈ సినిమాను అందరూ థియేటర్స్ లో చూసి కొత్త నటీనటులను ఎంకరేజ్ కోరుకుంటున్నట్లు తెలిపారు.

# 'ఓదెల 2' లో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ వున్నాయి చాలా గ్రాండ్ స్కేల్ నిర్మించాం- నిర్మాత డి.మధు

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్ లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అంచనాలని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లలో ఒకటిగా ఏప్రిల్ 17న ఓదెల2 థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి మధు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.



**'ఓదెల 2' ప్రాజెక్ట్ ఎలా మొదలైయింది?**

ఓదెల ఫస్ట్ పార్ట్ నేను సంపత్ నందిగారికి తెలియకుండానే చూశాను. చూసి చాలా ఎక్సైట్ అయ్యాను. అనుకోకుండా సంపత్ నందిగారే ఓదెల2 కథని నాతో చెప్పడం జరిగింది. నాకు కంటెంట్ చాలా నచ్చింది. అలా ప్రాజెక్టు మొదలైంది.

**మీరు సినిమాల్లోకి రావడానికి స్ఫూర్తి?**

నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఫ్యాషన్ ఉంది. కమర్షియల్ గా కాకుండా సినిమాపై పాషన్ తోనే ఇండస్ట్రీలోకి వచ్చాను.

**సంపత్ నందితో మీ కొలాబరేషన్ ఎలా ఉంది?**

సంపత్ నందితో నాకు మంచి వేవ్ లెంత్ కుదిరింది. భవిష్యత్తులో ఆయనతో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయాలని ఉంది. ఒక మంచి ప్రాజెక్టు రావాలంటే ఒక మంచి అండర్ స్టాండింగ్ ఉండాలి. అలాంటి అండర్ స్టాండింగ్ నాకు సంపత్ నందిగారికి మధ్య ఉంది.

**తమన్నా క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

తమన్నా అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఫస్ట్ లుక్ తోనే ఆ క్యారెక్టర్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ కథ విషయంలో తమన్నా చాలా ఎక్సైట్ అయ్యారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. ఏప్రిల్ మే ఎండల్లో చెప్పులు లేకుండా షూటింగ్ చేశారు. కరెక్ట్ టైంలో కరెక్ట్ కథ ఆమె దగ్గరకు వెళ్లిందని నేను నమ్ముతున్నాను.

**ప్రమోషనన్స్ ని చాలా డిఫరెంట్ ప్లాన్ చేయడానికి కారణం?**

నాకు మొదటి నుంచి ఏదైనా వెరైటీగా చేయాలని ఉంటుంది. కాశీలో ఈ సినిమాని లాంచ్ చేశాం. అలాగే మహా కుంభమేళాలో టీజర్ ని లాంచ్ చేసాం. చాలామంది అది రిస్క్ తో కూడుకున్న వర్క్ ఏమో అనుకున్నారు. అయితే ఎక్కడైతే రిస్క్ ఉంటుందో అక్కడే సక్సెస్ ఉంటుందని ఉంటుందని నా అభిప్రాయం. నేను సినిమాలపై పాషన్ తో ఇండస్ట్రీలోకి వచ్చాను. మంచి కథలు కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్టెడ్ గా చేయాలనేదే నా ప్రయత్నం.

# 'బ్రో' లా, సోదరా కూడా ఘనవిజయం సాధించాలి

వైవిధ్యమైన సినిమాలు, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే సినిమాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని





సంపాందించుకున్న కథానాయకుడు సంపూర్ణేష్ బాబు.. ఈ సారి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న 'సోదరా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబుతో పాటు సంజోష్ కూడా ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. మోహన్ మేనంపల్లి దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ఈ వేసవిలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్‌చేయడానికి థియేటర్స్‌ల్లో విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్, కల్ట్ నిర్మాత ఎస్‌కేఎస్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి రాజేష్ మాట్లాడుతూ " ఎస్‌కేఎన్ స్పీచ్ విన్న తరువాత ఎమోషన్ అయ్యాను. ఎస్‌కేఎన్ మంచి మనసు నాకు తెలుసు. ఈ సినిమాను ఎంకరైజ్ చేయడానికి తాను ఓ షోను ఏర్పాటు చేస్తానని చెప్పడం నిజంగా గొప్ప విషయం. ఈ సినిమా అందరికి మంచి విజయం అందించాలి. నాకు సంపూ ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. సంపూతో నేను సినిమా తీసి 13 ఏళ్లు అయ్యింది.

హృదయకాలేయం సూపర్‌హిట్ తరువాత సంపూ నన్ను ఆర్థికంగా చాలా ఆదుకున్నాడు.నాకు ఓ కారు, ఇల్లును తాను పెద్ద మొత్తంలో అడ్వాన్స్ కట్టి ఇప్పించాడు. నాకు సంపూ ఎప్పుడూ తోడుగా ఉన్నాడు. సినిమా ఎన్నో మ్యాజిక్కులు చేస్తుంది. సంపూను చూస్తే ఎంతో గర్వంగా అనిపిస్తుంది. తాను సంపాందించుకున్న డబ్బులో అందరికి సహాయం చేస్తుంటాడు. సంపూ నా దృష్టిలో స్టార్. ఏ రోజుకైనా మా ఇద్దరం ఒకరికొకరం ఉంటాం. ఈ సినిమా సంపూ కెరీర్‌లో మంచి విజయం సాధించాలి' అన్నారు.

# తమన్నా 'నషా'

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'రైడ్ 2' మే 1న విడుదల కానుంది. రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మీద ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇదొక క్రైమ్ డ్రామా కాన్వాస్ మీద రూపొందుతున్న ప్రాజెక్ట్. మొదటి భాగం విజయవంతమైన తరుణంలో 'రైడ్ 2'పై ప్రేక్షకుల ఆసక్తి పెరిగింది. ఇక ఇప్పుడు ఈ సినిమాకు తమన్నా స్పెషల్ సాంగ్ "నషా" అదనపు ఆకర్షణగా మారింది. తాజాగా విడుదలైన "నషా" అనే ఈ పాట యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. టి–సిరీస్ మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ సాంగ్‌కు ఇప్పటికే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తమన్నా గ్లామరస్ లుక్, ఎనర్జిటిక్ డాన్స్ స్టెప్పులు.. ఇవన్నీ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ పాటలో ఆమె గోల్డెన్ టాప్, వైట్ స్కర్ట్ లుక్‌లో కనిపించి ఓ రేంజ్‌లో సర్ ప్రైజ్ చేసింది. ఈ పాటకు జాస్మిన్ శాండ్‌లాస్, సచేత్ టాండన్, దివ్య కుమార్, సుమంతో ముఖర్జీ కలిసి గానం చేశారు. జానీ సాహిత్యం అందించగా, మ్యూజిక్‌ను 'వైట్ నాయిస్ కలెక్టివ్' అందించింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్స్ పని చేసిన ఈ పాటలో వినిపించే రిథమ్, హుక్ లైన్స్ అన్నీ యూత్‌ని షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా తమన్నా స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. పాట చిత్రీకరణ గ్రాండ్ గా జరగగా, మాస్ క్లాస్ ఆడియెన్స్‌కి ఇది పక్కా విజువల్ ఫీట్ లాగా మారింది. మరోసారి ఐటి ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఆయనకు అపోజిట్ గా రితేశ్ దేశ్‌ముఖ్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో కీలక పాత్రల్లో వాని కపూర్, రాజత్ కపూర్ వంటి వారు కూడా ఉన్నారు. అయితే, తమన్నా చేసిన ఐటెం సాంగ్ ఇప్పుడు సినిమా ప్రమోషన్స్ లో ప్రధాన హైలైట్‌గా మారింది. ఇప్పటివరకు తమన్నా నటించిన ఐటెం సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే "నషా" పాటలో ఆమె హావభావాలు, స్టెప్పులు, స్క్రీన్ ప్రెజెన్స్ చూస్తుంటే ఇది మరో చార్ట్ బస్టర్‌గా నిలవబోతోందని అనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ పాట మ్యూజిక్ రీల్స్, డాన్స్ కవర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ సాంగ్ సక్సెస్ తో రైడ్ 2 బిజినెస్ కి మరింత ఊపు వచ్చే అవకాశం ఉంది.




Published by Bodepudi Venkata Subbarao Managing Director on behalf of Mahanadu Media pvt ltd Editor: Marthi Subrahmanyam Phone: 9705311144